# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

07.03.2026 శనివారం Saturday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 228 | పేజీలు : 10 Pages : 10 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









## మనం గొర్రెలు మేపాలా..
# వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా?



### మాటలు, మూటలతో గెలిచి రాలేదు.. కేవలం ప్రజల మద్దతుతోనే వచ్చాం

- మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు.. పేదల పక్షపాత ప్రభుత్వం మనది
- ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మొదటి నుంచి అండగా నిలిచా
- మిత్రధర్మానికి కట్టుబడి కర్ణుడిలా మాదిగల వెంట ఉన్నా
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత వర్గీకరణ ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణే
- విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసమే విద్యాశాఖ నా వద్దే పెట్టుకున్నా
- హైదరాబాద్ శిల్పకళా వేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతల పిల్లలు రాజ్యం ఏలుతుంటే, బడుగు బలహీన వర్గాలు మాత్రం బర్రెలు, గొర్రెలు మేపాలా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో జరిగిన మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాము గత పాలకుల మాదిరిగా మాటలు, మూటలతో గెలిచి రాలేదని, కేవలం ప్రజల పూర్తి మద్దతుతోనే అధికారంలోకి వచ్చామని స్పష్టం చేశారు. తమది పూర్తిగా పేదల పక్షపాత ప్రభుత్వమని, తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదని తేల్చి చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి చేసిన సుదీర్ఘ పోరాటానికి తాను మొదటి నుంచి అండగా నిలిచానని గుర్తు చేశారు. మహాభారతంలో మిత్రుడి కోసం కర్ణుడు చివరికంటా నిలబడిన తరహాలోనే, మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని ఉద్వేగంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణను ప్రకటించిన తొలి రాష్ట్రం తెలంగాణనే అని స్పష్టం చేశారు. దళితులకు, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే ఏకైక లక్ష్యంతో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని రేవంత్ రెడ్డి వివరించారు.

వివరాలు 2వ పేజీలో



# బేషరతుగా లొంగిపోవాల్సిందే

- ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం..
- తీవ్రమవుతున్న యుద్ధ ప్రభావం
- యుద్ధంపై స్పెయిన్ ప్రధాని విమర్శలు
- ముడిచమురు ధరపై ఖతర్ హెచ్చరిక
- భారత్ నుంచి నిలిచిపోయిన 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు
- హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలతో మిల్లర్లు, రైతులకు తీవ్ర నష్టం
- శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు 24 విమానాలు రద్దు

వివరాలు 2వ పేజీలో

# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!



### రెండో దశ బడ్జెట్ సమావేశాల్లో ఓం బిర్లాపై ప్రతిపక్షాల తీర్మానం

- పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ 118 మంది ఎంపీల నోటీసు
- సోమవారం సాధారణ ఎంపీలా సభలో కూర్చోనున్న ఓం బిర్లా
- తీర్మానంపై తీవ్ర ఉత్కంఠ.. సొంత ఎంపీలకు విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్
- ఈ నెల 9, 10 తేదీల్లో తీర్మానంపై చర్చ, ఓటింగ్
- ఏప్రిల్ 2 వరకు జరగనున్న రెండో దశ పార్లమెంట్ సమావేశాలు

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. కేంద్ర బడ్జెట్ రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, అదే రోజు స్పీకర్ పై అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనుంది. ఓం బిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ 118 మంది ప్రతిపక్ష ఎంపీలు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్మానంపై చర్చ, ఓటింగ్ సందర్భంగా సభకు తప్పనిసరిగా హాజరు కావాలని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఈ పరిణామాలతో పార్లమెంట్ సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉంది.

వివరాలు 2వ పేజీలో

## అసోంలో కుప్పకూలిన
# సుఖోయ్
### ఇద్దరు పైలట్ల దుర్మరణం







- కర్బీ ఆంగ్లాంగ్ లో కూలిన భారత వైమానిక దళ జెట్
- మృతుల్లో ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న పూర్వేష్ దురాగ్కర్
- జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ప్రమాదం
- కేవలం నాలుగేళ్లు మాత్రమే దేశానికి సేవ చేశాడంటూ తండ్రి ఆవేదన
- శిక్షణా మిషన్ లో ఉండగా గాల్లోనే కుప్పకూలిన వైనం

వివరాలు 2లో

## సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక
# లాంఛనం

- రాజ్యసభ నామినేషన్ల పరిశీలన పూర్తి
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడమే కారణం
- వివాదరహితుడు కావడంతోనే వేం వైపు అధిష్టానం మొగ్గు





కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ బరిలో నిలిచిన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో.. తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు లేని కారణంగా స్వతంత్ర అభ్యర్థి దాఖలు చేసిన పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. పోటీలో ఇంకెవరూ లేకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నిక లాంఛనంగా మారింది.

వివరాలు 3లో

# సివిల్స్ ఫలితాలు విడుదల
### సత్తా చాటిన తెలుగు తేజాలు



- ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్ గా అనూజ్ అగ్నిహోత్రి
- అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు
- మొత్తంగా 1087 మంది అభ్యర్థుల ఎంపిక

3లో


# 99 రోజుల ప్రణాళిక.. డైవర్షన్ డ్రామా!



- ప్రజలను ఏమార్చేందుకే సర్కార్ కొత్త ప్లాన్
- రెండేళ్లుగా రాష్ట్రంలో అదే జరుగుతున్నది
- మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం
- ఇచ్చిన దరఖాస్తులకే ఇంకా దిక్కులేదు
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునే వ్యూహం
- మండిపడ్డ హరీశ్ రావు

వివరాలు 2వ పేజీలో

# తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ



- పార్టీ నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ
- వరంగల్ మాజీ మేయర్‌కు దక్కిన పదవి
- నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించిన చరిత్ర
- నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వివరాలు 2వ పేజీలో

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | శనివారం 07 మార్చి 2026

# బేషరతుగా లొంగిపోవాల్సిందే

**ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం.. తీవ్రమవుతున్న యుద్ధ ప్రభావం**

**యుద్ధంపై స్పెయిన్ ప్రధాని విమర్శలు..ముడిచమురు ధరపై ఖతర్ హెచ్చరిక**

**భారత్ నుంచి నిలిచిపోయిన 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు**

**హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలతో మిల్లర్లు, రైతులకు తీవ్ర నష్టం**

**శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు రాకపోకలు సాగించే 24 విమానాలు రద్దు**

**న్యూఢిల్లీ, మార్చి 6:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధం మొదలై ఏడు రోజులు గడుస్తున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందేనని తేల్చి చెప్పారు. మరోవైపు ఈ యుద్ధం ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థ, ప్రయాణాలపై తీవ్రంగా పడుతోంది. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల దేశం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన బాస్మతి బియ్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు భారీగా నిలిచిపోయాయి. దీనికి తోడు హైదరాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే విమానాల రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడింది.

### లొంగిపోవాల్సిందేనన్న ట్రంప్

ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందేనని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో తాజాగా పోస్టు పెట్టారు. ఇరాన్ లొంగిపోయిన అనంతరం దేశాన్ని ముందుకు నడిపించే నాయకత్వ ఎంపిక ఉంటుందని, ఆ తరువాత ఇతర మిత్రదేశాలతో కలిసి ఇరాన్ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. ఇరాన్‌కు అద్భుత భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఇరాన్ యుద్ధంపై ఐరోపా దేశాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ యుద్ధానికి యస్ చెప్పేది లేదని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ స్పష్టం చేస్తూ ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఒక అసాధారణ తప్పిదమని వ్యాఖ్యానించారు. దాడులకు వీలుగా స్పెయిన్ దక్షిణ భాగంలో సైనిక స్థావరాలను కలిసి నిర్వహిద్దామన్న ట్రంప్ ఆఫర్‌ను ప్రధాని శాంచెజ్ తిరస్కరించారు. యుద్ధం ఇలాగే మరో రెండు మూడు వారాలు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని, బ్యారెల్ ముడి చమురు ధర 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఖతర్ ఇంధన శాఖ మంత్రి హెచ్చరించారు.

### నిలిచిపోయిన బాస్మతి ఎగుమతులు

యుద్ధం వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. చమురు విషయంలో ఇబ్బంది ఏమీ లేకపోయినా రవాణా జరిగే హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు, పలు నౌకలు నిలిచిపోవడంతో భారత్‌లో పండే బాస్మతి బియ్యం ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. సుమారు 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు నిలిచిపోయినట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందులో కొంత సరుకు నౌకల్లో, మరికొంత పోర్టులు, గోడౌన్లలో నిలిచిపోవడంతో వ్యాపారులు, రైతులు, మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారత్ నుంచి ఏటా సగానికి పైగా బాస్మతి బియ్యం సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ తదితర గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకే వెళ్తుంది. రవాణా నిలిచిపోవడంతో దేశీయంగా బాస్మతి ధరలు క్వింటాల్‌కు సగటున రూ. 1,000 వరకు తగ్గాయి. మధ్యప్రదేశ్‌పై ఈ ప్రభావం ఎక్కువగా పడింది. అక్కడి నుంచి రవాణా అయ్యే అరుదైన బర్వాని రకం అరటి ఎగుమతులు కూడా ఆగిపోయాయి. ఈ సంక్షోభం ముగిస్తేనే తిరిగి వ్యాపారం పుంజుకుంటుందని రైతులు, వ్యాపారులు ఆశిస్తున్నారు.

### గల్ఫ్‌కు 24 విమానాలు రద్దు

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు, గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో 12 విమానాలు రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దయినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.

# అసోంలో కుప్పకూలిన సుఖోయ్.. ఇద్దరు పైలట్ల దుర్మరణం!

**కర్బీ ఆంగ్లాంగ్ లో కూలిన భారత వైమానిక దళ జెట్**

**మృతుల్లో ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న పూర్వేష్ దురాగ్కర్**

**జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ప్రమాదం**

**కేవలం నాలుగేళ్లు మాత్రమే దేశానికి సేవ చేశాడంటూ తండ్రి ఆవేదన**

**శిక్షణా మిషన్ లో ఉండగా గాల్లోనే కుప్పకూలిన వైనం**

**న్యూఢిల్లీ, మార్చి 6:** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్ లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కుప్పకూలింది. ఈ దారుణ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ తో పాటు స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ఉన్నారు. పూర్వేష్ ఇటీవల పాకిస్థాన్ పై చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొనడం గమనార్హం. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి శిక్షణా మిషన్ కోసం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దేశ సేవలో తన కొడుకు ప్రాణాలు అర్పించాడని పూర్వేష్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు. ఈ విషయం ముందుగా తమకు తెలియదని, ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తర్వాతే తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. ఆ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని, అంతా ముగిసిన తర్వాతే తన కొడుకు ఫోన్ చేసి విషయం చెప్పాడని ఆయన వివరించారు. ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు కూడా కొడుకుతో మాట్లాడినట్లు చెబుతూ రవీంద్ర కన్నీటి పర్యంతమయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు గర్వంగా ఉందని చెప్పారు. పూర్వేష్ ఎప్పుడూ యుద్ధ విమానాలను నడిపిన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని ఆయన గుర్తుచేసుకున్నారు.

### నాలుగేళ్లు మాత్రమే దేశ సేవ..

"నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, కోరుకున్నంత కాలం దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు.. తిరిగి విధుల్లోకి చేరిన తర్వాత ఇలా జరిగింది" అంటూ రవీంద్ర తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ఓ శిక్షణా మిషన్ లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్ తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో అది కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.

### పాక్ ను వణికించిన ఆపరేషన్ సిందూర్

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన రెసిస్టెన్స్ ఫ్రంట్.. ఏప్రిల్ 22న పహల్గామ్ లో ఉగ్రదాడికి పాల్పడింది. దీనికి ప్రతిస్పందనగా భారత దళాలు మే 7వ తేదీన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించాయి. పాకిస్థాన్, పీఓకే లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తర్వాత పాకిస్థాన్.. భారత్ పై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడగా, భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్ ను వణికించాయి. మే 10వ తేదీన ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించడంతో ఆపరేషన్ సిందూర్ నిలిచిపోయింది.

# మనం గొర్రెలు మేపాలా.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా?



**హైదరాబాద్, మార్చి 6:** గత బీఆరఎస్ ప్రభుత్వం దళితులకు, బడుగు బలహీన వర్గాలకు బర్రెలు, గొర్రెలు ఇచ్చి మోసం చేసిందని.. మనం గొర్రెలు మేపాలా, వాళ్ల పిల్లలు రాజ్యం ఏలాలా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాము మాటలు, మూటలతో గెలిచి రాలేదని, కేవలం ప్రజల మద్దతుతోనే అధికారంలోకి వచ్చామని ఆయన స్పష్టం చేశారు. పేదల పక్షపాత ప్రభుత్వమైన తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదని తేల్చి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో జరిగిన మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. ఎస్సీ వర్గీకరణకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, మిత్రధర్మానికి కట్టుబడి కర్ణుడిలా మాదిగల వెంట ఉంటానని ఉద్ఘాటించారు.

### అక్రమ సంపాదన లేదు.. మార్పు కోసమే వచ్చాం

ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని, మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని ప్రకటించారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ఈ ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. గత ఎన్నికల్లో తాము కేవలం మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల అండదండలతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదని స్పష్టం చేశారు. చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని, ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు.

### కర్ణుడిలా అండగా నిలబడ్డా..

వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో సుదీర్ఘంగా పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్ల నుంచీ ఈ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం తాను మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని ఆయన భరోసా ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని రేవంత్ వివరించారు. మహాభారతంలో మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని ఆయన గుర్తు చేశారు. అదే కర్ణుడి మాదిరిగా తాను కూడా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ ఉద్వేగంగా పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపే న్యాయం ఉందని అన్నారు. అందుకే ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత దేశంలోనే వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు.

### విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసమే..

తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని సీఎం రేవంత్ ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు హితవు పలికారు. తెలంగాణలో ప్రస్తుతం ఆర్థిక సమస్యలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని స్పష్టం చేశారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ప్రధాన ఆలోచన అని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆరఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు ముందే తెలియవా, వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి అంటూ ఆ పార్టీ నేతలపై సీఎం రేవంత్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు మేపుకోవాలా, వాళ్ల పిల్లలు మాత్రం రాజ్యం ఏలుతారా అంటూ బీఆరఎస్ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ సభ స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం!

- రెండో దశ బడ్జెట్ సమావేశాల్లో ఓం బిర్లాపై ప్రతిపక్షాల తీర్మానం
- పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ 118 మంది ఎంపీల నోటీసు
- సోమవారం సాధారణ ఎంపీలా సభలో కూర్చోనున్న ఓం బిర్లా
- తీర్మానంపై తీవ్ర ఉత్కంఠ.. సొంత ఎంపీలకు విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్
- ఈ నెల 9, 10 తేదీల్లో తీర్మానంపై చర్చ, ఓటింగ్
- ఏప్రిల్ 2 వరకు జరగనున్న రెండో దశ పార్లమెంట్ సమావేశాలు

**న్యూఢిల్లీ, మార్చి 6 :** కేంద్ర బడ్జెట్ పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో మొదటి దశ సమావేశాలు అర్ధాంతరంగా వాయిదాపడ్డాయి. తిరిగి ప్రారంభం కానున్న ఈ రెండో దశ బడ్జెట్ సమావేశాల్లోనే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నాయి. ఆ తర్వాత దీనిపై సభలో చర్చ, ఓటింగ్ ఉంటాయి. తాజా బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి.



### 118 మంది ఎంపీల సంతకాలతో నోటీసు

స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గత నెలలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరుతూ అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసి ఈ నోటీసులు ఇచ్చారు. అయితే, ఆ నోటీసు ఇచ్చిన తర్వాత నుంచి సభ వాయిదా పడి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇప్పుడు సభ ప్రారంభం కాగానే వచ్చే వారం లోక్ సభలో ప్రతిపక్షం ఈ అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది.

### సాధారణ ఎంపీగా ఓం బిర్లా

ఈ అవిశ్వాస తీర్మాన ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు స్పీకర్ చైర్ లో ఓం బిర్లానే ఉంటారు. సోమవారం ప్రారంభం కానున్న చర్చ సమయంలో మాత్రం ఆయన సాధారణ ఎంపీలాగే సభలో కూర్చుంటారు. పార్లమెంట్ నిబంధనల ప్రకారం ఒక ఎంపీగా తన స్పీకర్ పదవిని రక్షించుకుంటూ మాట్లాడే అవకాశం ఆయనకు ఉంటుంది.

### విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్

లోక్ సభలో స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్న నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. దీనిపై ఈ నెల 9, 10 తేదీల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుంది. అందువల్ల ఈ రెండు రోజుల్లో ప్రతి ఒక్కరూ సభకు తప్పనిసరిగా హాజరవ్వాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. సభలో చర్చ, ఓటింగ్ సందర్భంగా అందుబాటులో ఉండాలని కఠినంగా ఆదేశించాయి. తమ ఎంపీలు సభలో ఉండి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని బీజేపీ సూచించింది.

# 99 రోజుల ప్రణాళిక.. మరో డైవర్షన్ డ్రామా!

- ప్రజలను ఏమార్చేందుకే కాంగ్రెస్ సర్కార్ కొత్త ప్లాన్
- రెండేళ్లుగా రాష్ట్రంలో అదే జరుగుతున్నది
- మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం
- గతంలో ఇచ్చిన దరఖాస్తులకే ఇంకా దిక్కులేదు
- 800 రోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే వ్యూహం
- 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీశ్ రావు



**హైదరాబాద్, మార్చి 6:** గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు ఎలాంటి దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేశారని ప్రచారం నిర్వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ వైఫల్యాలు మీరే ప్రచారం చేసుకుంటారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు మండిపడ్డారు.

### డైవర్షన్ ప్లాన్ తో డ్రామాలు

యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ తో సరికొత్త డ్రామాకు తెర తీశారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఇదంతా కేవలం ప్రచారం కోసమేనని, దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని అన్నారు. దాదాపు 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజుల ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీశారని ఆరోపించారు. రెండున్నరేండ్ల పాలన పూర్తయిన తర్వాత ఇప్పుడు ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా అంటూ నిలదీశారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాములు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ప్లాన్ ఇదని తీవ్రంగా విమర్శించారు.

### రైతులు, యువతకు మోసం

కోతల సమయం వచ్చినా ఈ సీజన్ కు సంబంధించి ఇప్పటి వరకు రైతు భరోసాకు దిక్కు లేదని హరీశ్ రావు గుర్తు చేశారు. గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేశారని మండిపడ్డారు. చివరకు యూరియా కూడా సక్రమంగా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి పల్లెల్లో రైతులకు వివరిస్తారా అని నిలదీశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను నిలువునా మోసం చేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ను కాస్తా జాబ్ లెస్ క్యాలెండర్ గా మార్చేశారని ఎద్దేవా చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ప్రజాధనం లూటీకి తెగబడ్డారని ఆరోపించారు.


### పబ్లిసిటీ గారడీలను గమనిస్తున్నారు

రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయో, వాటికి ఎందుకు దిక్కు లేకుండా పోయాయో చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అవన్నీ పక్కనపెట్టి యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కాంగ్రెస్ నేతలు కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు. అందని గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది బాధితుల సంగతేంటో ముందు చెప్పాలన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ అడ్డుకట్ట లాంటివన్నీ పత్రికల్లో పబ్లిసిటీ ఇచ్చుకునేందుకు పెట్టుకున్న పేర్లు తప్ప, వీటి అమలులో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. పాలన గాలికి వదిలేసి పబ్లిసిటీ పేరిట చేస్తున్న మీ గారడీలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఈ దుర్మార్గ పాలనను నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

# సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక లాంఛనం

- రాజ్యసభ నామినేషన్ల పరిశీలన పూర్తి
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ
- 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడమే కారణం
- వివాదరహితుడు కావడంతోనే వేం వైపు అధిష్ఠానం మొగ్గు

**హైదరాబాద్, మార్చి 6:** రాజ్యసభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాల పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సాయి అనే వ్యక్తి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. దీంతో





కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక దాదాపు ఏకగ్రీవం కానుంది.

### స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

రాజ్యసభ అభ్యర్థిగా బలపరుస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు నామినేషన్ పత్రాలపై తప్పనిసరిగా ఉండాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. కానీ ఆ సంతకాలు సాయి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై లేవని అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చారు. నిబంధనల ప్రకారం కనీస మద్దతు లేకపోవడం వల్ల ఈ పత్రాలను తిరస్కరించినట్లు వారు తెలిపారు.

### సింఘ్వీ, వేం ఏకగ్రీవం

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎన్నిక లాంఛనంగా మారింది. అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుసగా మరోసారి అవకాశం కల్పించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని తొలిసారిగా రాజ్యసభకు ఎంపిక చేసింది.

### వేం వైపే అధిష్ఠానం మొగ్గు

రాజ్యసభ సీటు ఒకటి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానం గతంలోనే ప్రకటించింది. ఇక మరో రాజ్యసభ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చాలా మంది నేతలు తీవ్రంగా పోటీ పడ్డారు. దాదాపు 16 మందితో కూడిన జాబితాను సిద్ధం చేసి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి వివాదరహితుడు కావడంతో ఆయన వైపు అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# ప్రజాపాలన ప్రణాళికను సక్సెస్ చేద్దాం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..

**కరీంనగర్, మార్చి 6 :** సన్నాక సమావేశంలో పాల్గొన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎంపీ ,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సిపి ఎస్పీలు అదనపు కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో 99 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగము ప్రజా ప్రతినిధులు ప్రజలు, అందరం కలిసి విజయవంతం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్ర భాగాన నిలుపుతామని పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని తెలిపారు. రెండున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు ,ఎమ్మెల్యేలు పెద్దపెల్లి ఎంపీ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు సిపి, ఎస్పీలు అడిషనల్ కలెక్టర్లు అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి కి సంబంధించిన



పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 99 రోజులపాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు పట్టణాల్లో ప్రధాన సమస్యలన పరిష్కారం.. రెండున్నర సంవత్సరాల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే మహత్తరమైన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్ అభివృద్ధిలో నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని పేర్కొన్నారు. అత్యధికంగా పంట పండించడంలోనూ అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడం లో తెలంగాణ ప్రభుత్వానికి సాటి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇరిగేషన్ తోపాటు విద్యుత్ రంగంలోనూ మంచి ఫలితాలు ప్రభుత్వం సాధిస్తుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందుండి 99 రోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్లు ముందుండి నడిపించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సన్నాహక సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు సమష్టిగా సఫలీకృతంగా ఈ కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా ఉంటూ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి చేద్దామన్నారు. తద్వారా కరీంనగర్ జిల్లాను అగ్ర భాగాన నిలుపుదామని పేర్కొన్నారు.

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు
# వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి

- రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ





**హైదరాబాద్,మార్చి6:** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఊ163 (గతంలో ఔఊ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల ÷÷-ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ ÷÷-ల ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ

### పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ
### వరంగల్ మాజీ మేయర్ కు దక్కిన కీలక పదవి
### ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం
### నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించిన చరిత్ర
### నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



**హైదరాబాద్, మార్చి 6:** తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత ఉండటం వల్ల అధిష్ఠానం ఆమెపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎర్రబెల్లి స్వర్ణకు వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తున్న ఆమె, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశారు.

### మొట్టమొదటి మహిళా మేయర్ గా..

గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా పనిచేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఎన్నికైన ఆమె, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్ గా సేవలందించి నగరాభివృద్ధిలో తనదైన ముద్రవేశారు. పరిపాలనలో మంచి మార్కులు తెచ్చుకున్నారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ నియామకం పట్ల జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నాయకురాలికి అధిష్ఠానం తగిన గుర్తింపు ఇచ్చిందని కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సివిల్స్ ఫలితాలు విడుదల.. సత్తా చాటిన తెలుగు తేజాలు

### ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్ గా అనూజ్ అగ్నిహోత్రి
### అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు
### మొత్తంగా 1087 మంది అభ్యర్థుల ఎంపిక
### 15 రోజుల్లో వెబ్ సైట్ లో మార్కులు అప్ లోడ్
### ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచిన యూపీఎస్సీ

**న్యూఢిల్లీ, మార్చి 6:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శుక్రవారం సివిల్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలవగా, ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్, రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ ప్రతిష్టాత్మక పరీక్షల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు అభ్యర్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు.

### తెలుగు అభ్యర్థుల ర్యాంకులు ఇవే..

తెలుగు రాష్ట్రాలకు చెందిన సృజన 55వ ర్యాంక్, డీఎస్ కే ప్రచేత్ 193వ ర్యాంక్ సాధించారు. ఎం.పవన్ కుమార్ రెడ్డి (297వ ర్యాంక్), ఎస్. వర్షిత్ రెడ్డి (259వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్ రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించి తమ సత్తా చాటారు.

### 15 రోజుల్లో వెబ్ సైట్ లో మార్కులు

ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్ లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాల కోసం 23385271, 23381125, 23098543 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది.

### 1087 మంది అభ్యర్థుల ఎంపిక

గతేడాది (2025లో) సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ) నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ తో పాటు గ్రూప్ ఏ, గ్రూప్ బీ లోని వివిధ సెంట్రల్ సర్వీస్ లో చేరనున్నారు.

# మూడు వారాల్లో క్యాతన్‌పల్లి ఎన్నిక

### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్,మార్చి6:** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.



సంపాదకీయం

# ఈ యుద్ధం ముగిసేదెలా ?

**పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది.ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది.**

ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయ త్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

- డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి



**టెహ్రాన్, మార్చి 6:** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహెన్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఫద్ర, సెజ్జిల్, సుమర్ వంటి క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు పాకే ప్రమాదం ఉంది.

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

- అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు
- ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే

**న్యూఢిల్లీ, మార్చి 6:** పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై




స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.




# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

**200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన**

**న్యూఢిల్లీ, మార్చి 6:** అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే - ట్రంప్

**ఢిల్లీ:** ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం ఉండదని, బేషరతుగా లొంగిపోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఆ తర్వాత ఇరాన్‌కు ఆమోదయోగ్యమైన నాయకుడి ఎన్నిక ఉంటుందన్నారు. వివిధ భాగస్వామ్య పక్షాలతో కలిసి ఇరాన్‌ను సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు తాము కృషి చేస్తామన్నారు. గతంలో లేని విధంగా ఇరాన్‌ను ఆర్థికంగా మెరుగైన, బలమైన స్థితికి తీసుకువస్తామన్నారు. ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్టు చేశారు.మరోవైపు పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంపై కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తున్నాయని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ పేర్కొన్నారు. అయితే, ఏయే దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. తమ ప్రాంతంలో శాశ్వత శాంతికి కట్టుబడి ఉన్నామని.. అయినప్పటికీ, తమ దేశ గౌరవం, సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

**అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు**

**అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం**

**వాషింగ్టన్, మార్చి 6:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.



# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ....

- విద్యార్థులకు ఆల్ ది బెస్ట్....
- ఆవుటి ఉషారాణి వసంత కుమార్ అంగన్వాడి టీచర్.....

**నేటి సాక్షి,నారాయణపేట, మార్చ్ 6, ( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ), :** నారాయణపేట జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో శుక్రవారం రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో జాజాపూర్ గ్రామానికి చెందిన ఆవుటి ఉషారాణి వసంత కుమార్ దంపతుల అంగన్వాడి టీచర్ పదో తరగతి 82 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను మరియు పెన్నులను పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఆవుటి ఉషారాణి మాట్లాడుతూ..... పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని విద్యార్థులకు పదవ తరగతి చాలా కీలకమైనదని మంచి మార్కులు సాధించడం ద్వారా ఉన్నత విద్యకు గట్టి పునాది



అవుతుందని విద్యార్థులు భవిష్యత్తులో పదో తరగతి ఉత్తీర్ణులై తమకిష్టమైనటువంటి కోర్సును ఎన్నుకొని జీవితంలో రాణించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ప్యాడ్లను పెన్నులను పంపిణీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ భాను ప్రకాష్ లక్ష్మణ్ నరసింహ నర్సింలు ప్రతాప్ నిర్మల శశిరేఖ ,శ్రీదేవి,వెంకటేష్ పాఠశాల ప్రధానో ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం 2కె రన్" కార్యక్రమం

- డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం 2కె రన్" కార్యక్రమం లో పాల్గొన్న వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,

**నేటి సాక్షి వికారాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం"లో భాగంగా, 5వ థీమ్ అయిన "పిల్లల భద్రత -- డ్రగ్స్ కు అడ్డుకట్ట" అంశంపై కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ స్థాయిలో 2ఖ రన్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఈగల్ టీం గౌరవ డైరెక్టర్ శ్రీ సందీప్ శ్యాండిల్య గారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ "ఖుఎ నో టూ డ్రగ్స్ ", "డ్రగ్ ఫ్రీ తెలంగాణ " అనే నినాదాలతో యువత ముందుకు సాగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులని, వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, యువత తమ శక్తిని క్రీడలు, విద్య ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం విభాగాన్ని ప్రజలు




సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ వ్యాపారంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, యువత భవిష్యత్తును కాపాడటమే పోలీస్ శాఖ, ఈగల్ టీమ్ ల ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. మహిళలు విద్య, ఉద్యోగం, క్రీడలు ఇతర రంగాల్లో రాణించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ అవగాహన కార్యక్రమం కేవలం కొడంగల్‌కే పరిమితం కాకుండా, వికారాబాద్ జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్ల పరిధిలోని 76 గ్రామాలలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో అవగాహన ర్యాలీలు, సమావేశాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో డ్రగ్స్ పై చైతన్యం తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ -- ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ నడుం బిగించి "డ్రగ్స్ రహిత తెలంగాణ" లక్ష్యంగా కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం అదనపు ఎస్పీ కృష్ణ మూర్తి, జిల్లా అదనపు ఎస్పీ దీ. రాములు నాయక్, పరిగి డీస్పీ శ్రీనివాస్, డీటీసీ డీస్పీ శ్రీనివాసులు, ఏ ఆర్ డీస్పీ వీరేష్, కొడంగల్ ఏం ఆర్ ఓ రాంబాబు, ఎంపీడీఓ ఉష అరి , ఏం ఈ ఓ రాం రెడ్డి , మునిసిపల్ ఛైర్మన్ ప్రశాంత్, మునిసిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఈగిల్ టీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాలు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం మాదారంలో భారీ అవగాహన సదస్సు




- ముఖ్య అతిథులుగా హాజరైన ఈగల్ టీం డైరెక్టర్ సందీప్ శాండిల్య. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**నేటి సాక్షి వికారాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, 5వ థీమ్ 'పిల్లల భద్రత – డ్రగ్స్ కు అడ్డుకట్ట' పై పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదారం గ్రామంలో ఈ రోజు భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఈగల్ టీం గౌరవ డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ సందీప్ శాండిల్య మాట్లాడుతూ, డ్రగ్స్ అనే మహమ్మారి పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత సరదాగా ప్రారంభమయ్యే చిన్న చిన్న అలవాట్లు కాలక్రమేణా ప్రాణాంతకమైన వ్యసనాలుగా మారి, వ్యక్తిగత జీవితంతో పాటు సమాజాన్ని కూడా సర్వనాశనం చేస్తాయని హెచ్చరించారు. ముఖ్యంగా పసిపిల్లలను డ్రగ్స్ ఊబిలోకి దించడం అనేది క్షమించరాని నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. విద్యార్థులు చెడు స్నేహాలకు, అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో కూడిన ఉత్తమ అలవాట్లను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా మాట్లాడుతూ, డ్రగ్స్ అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదని, ఇది ఒక 'ఆర్గనైజ్డ్ క్రైమ్' (వ్యవస్థీకృత నేరం) అని అభివర్ణించారు. మన రాష్ట్ర అభివృద్ధిని, దేశ భవిష్యత్తును దెబ్బతీయడానికి శత్రువుల చేతిలో డ్రగ్స్ ఒక మారణాయుధంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు ఈ విషయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో డ్రగ్స్ సరఫరా లేదా వాడకం గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా, విద్యార్థుల భద్రతపై దృష్టి సారిస్తూ వారికి 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' పై అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే తమకు ఎదురయ్యే అసౌకర్యాలను గుర్తించి, ధైర్యంగా తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలే తప్ప పక్కదారి పట్టకూడదని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక ఆర్థిక నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం అదనపు ఎస్పీ కృష్ణ మూర్తి, జిల్లా అదనపు ఎస్పీ దీ. రాములు నాయక్, పరిగి డీస్పీ శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారులు, ఈగిల్ టీం సిబ్బంది,మాదారం గ్రామం సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాలు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను కేసీఆర్‌కు అందజేసిన ఆలయ కమిటీ

- నాచారం గుట్ట లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు కేసీఆర్‌కు ఆహ్వానం

**నేటి సాక్షి గజ్వేల్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు చంద్రశేఖర్ రావు ను శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం -- నాచారం గుట్ట ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి తో కలిసి ఆలయ ప్రతినిధులు కేసీఆర్‌ను కలిసి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ నెల 8వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్న శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఛైర్మన్ రవీందర్, ఈఓ రంగాచారి, ఆలయ అర్చకులు కేసీఆర్‌కు అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాన్ని సమర్పించి బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య కేసీఆర్‌కు ఆశీర్వాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా



ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, ధ్వజారోహణం, వాహన సేవలు, కల్యాణోత్సవం వంటి పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం పొందేలా ఏర్పాట్లు చేస్తున్నామని కెసిఆర్ కు వివరించారు . బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పెంచే మహోత్సవాలుగా జరుగుతాయని, ఈసారి కూడా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ అధికారులు కోరారు.

# ఐసిడిఎస్ సూపర్వైజర్ గా హేమలత



**నేటిసాక్షి,నల్లబెలి :** నల్లబెల్లి సెక్టర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ గా కె హేమలత గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నల్లబెల్లి సెక్టర్ సూపర్వైజర్ గా పనిచేసిన అరుణ బదిలీపై నర్సంపేట సెక్టార్కు వెళ్లడంతో ఆమె స్థానంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారము నల్లబెల్లి సెక్టర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ గా బాధ్యతలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు అదేవిధంగా రుద్రగూడెం సెక్టర్ సూపర్వైజర్ గా అదనపు బాధ్యతలు సైతం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

# మహా మృత్యుంజయ అవతారంలో రాజరాజేశ్వరుడు



**నేటిసాక్షి,నల్లబెల్లి :** మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శశిర ఋతువు పాల్గొనమాస బహుళ తదియ శుక్రవారం సంకటహర చతుర్థి సందర్భంగా రాజరాజేశ్వరుడు మహామృత్యుంజయనిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయ అర్చకులు పెండోట మురళీమోహన్ ఆచారి స్వామివారని మహా మృత్యుంజయునిగా అలంకరించడంతో పాటు బాలా త్రిపుర సుందరీ దేవి. పార్వతి మాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయములో కొలువు దీరిన సకల దేవతలకు సైతం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు అనం తరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. సంకటహర చతుర్థి సందర్భంగా భక్తులు వేకువజాము నుండి దేవతా మూర్తులను దర్శించుకున్నారు.

# కస్తూర్బా విద్యార్థునులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

**నేటిసాక్షి, నల్లబెల్లి :** మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థునులకు తెలంగాణ దళిత విద్యావంతుల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరికిరత్నం ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థునులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం బట్టు సాంబయ్య




మాట్లాడుతూ... విద్యార్థులు ఒక గమ్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యం దిశగా ప్రయాణించాలన్నారు. ఉన్నత స్థాయిలో నిలువాలనుకునే బాలికలు ఇప్పటినుండే ఉన్నతమైన ఆలోచన కలిగి ఉండాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చే విధంగా వారి ఆలోచన స్థాయి ఉండాలని ఆకాంక్షించారు. అలాగే పదవ తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి మొదటి బహుమతిగా 5116 రెండవ బహుమతిగా 3116 ఆర్థిక ప్రోత్సాహం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సునీత ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాత పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం



**నేటి సాక్షి, నారాయణపేట, మార్చ్ 6, ( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ) :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు మత్స్య పశుసంవర్ధక పాడి పరిశ్రమ క్రీడాలు యువజనుల శాఖ మాత్యులు గౌరవ డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లాలో నిమక్తల్ నియోజకవర్గం ధన్వాడ మండల పాతపల్లి గ్రామంలో ఉంచకాయల సోనీ అశోక్ గార్ల ఇందిరమ్మ నూతన గృహప్రవేశానికి ఉట్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డి విగ్నేశ్వర్ రెడ్డి. తిప్రస్పల్లి పి రామకృష్ణ, రఘు నరేష్ అరాఫత్, పాత పల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సల్మాన్ పాషా ఇంటి నూతన గృహప్రవేశానికి మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | శనివారం 07 మార్చి 2026

# 'బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్' అవార్డు అందుకున్న నటుడు ఆనంద చక్రపాణి



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'వింధ్యా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్' 7వ సంవత్సరపు ఉత్సవ పోటీలో తెలుగు సినిమా నటుడు ఆనంద చక్రపాణి జాతీయ స్థాయిలో 'బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్' అవార్డును సాధించారు ఆనంద చక్రపాణి ఒకప్పుడు మిర్యాలగూడ వాసి. చలనచిత్ర నటుడిగా ప్రస్తుతం హైదరాబాద్ లో స్థిరపడ్డారు. ఈ పోటీలో సుమారు 40 దేశాల చిత్రాలు పాల్గొన్నాయి. షార్ట్ ఫిల్మ్ కేటగిరీ లో 'సారీ' అనే చిత్రంలో చక్రపాణి కనబరిచిన నటనకు గాను జాతీయ స్థాయిలో ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ,ఈ అవార్డు తనకు ఎంతో స్ఫూర్తి కలిగించిందని, ఇది తనకు దక్కిన ప్రోత్సాహం అని అన్నారు.నటుడిగా మరిన్ని మంచి పాత్రలను పోషించి, అందరి మన్ననలు పొందుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు కేతనపల్లి శ్రీనివాసరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, కస్తూరి ప్రభాకర్, విద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, హరికృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన...

## యువజన సంఘాల రాష్ట్ర నాయకుడు కందాల నవీన్ గౌడ్



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండల కేంద్రంలో భీమనాతి ధర్మయ్య స్వరూప కుమార్తె కీర్తన శ్రీకాంత్ వివాహం గౌడ సంఘం కమిటీ హాల్ లో జరగగా యువజన సంఘాల రాష్ట్ర నాయకుడు కందాల నవీన్ గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పత్రిక విలేఖరి బుర్ర కోటేష్ గౌడ్,భీమనాతి అరవింద్, శివ గౌడ్, బన్నీ గౌడు, తదితరులు పాల్గొన్నారు,

# లక్ష్మీ నరసింహా స్వామి ఆలయానికి భూమి పూజ

## హాజరైన గ్రామ సర్పంచ్ అరుకొంతం గోపాల్ రెడ్డి



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం, మండలం లోని చొక్కారావు పల్లె గ్రామం లో నూతన లక్ష్మీ నరసింహ స్వామి, వెంకటేశ్వర స్వామి, శివాలయానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు నాగసాయి శర్మ వేదమం త్రాలతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ అరుకొంతం గోపాల్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముస్కు కరుణాకర్ రెడ్డి, అనంతరెడ్డి, నంది రెడ్డి, చంద్రారెడ్డి నరసింహా రెడ్డి, సాగర్ రెడ్డి, తిరుపతి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీని నిలబెట్టుకున్న పారువెల్ల సర్పంచ్.



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండలం పారు వేళ్ళ గ్రామంలో యాల లక్ష్మి రామిరెడ్డి . స్థానిక సర్పంచి ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్క ఆడపడుచుకు కళ్యాణానికి. 5116. ఇస్తానని హామీ ఇచ్చారు హామీ ప్రకారం శుక్రవారం రోజున యాల లక్ష్మి మాధవరెడ్డి గార్ల కుమార్తెకు వివాహానికి నగదు అందజేశారు. కుటుంబ సభ్యులు పారువెల్ల గ్రామస్తులు సర్పంచ్ లక్ష్మీ రామి రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# రేపాల జాతరలో ప్రత్యేక ఆకర్షణగా బొల్లం మల్లన్న





- స్వయంభు రేపాల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దర్శనానికి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్..
- స్వామివారి ఆశీస్సులతో భక్తులకు సేవ..
- బొల్లం మల్లయ్య యాదవ్ చేతుల మీదుగా అన్నదానం ప్రారంభం..
- తిలకం దిద్ది స్వాగతం పలికిన మహిళలు..
- జాతరలో మార్మోగిన మల్లన్న.. మల్లన్న...

**నేటి సాక్షి, మునగాల( పాముల రాఘవేందర్) :** సూర్యపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామంలో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న పావనమైన జాతర మహోత్సవాలు గత పది రోజులుగా అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మికోత్సాహంతో కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల చివరి దినమైన శుక్రవారం వసంతోత్సవ మహోత్సవం ( గాందోలి) సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో నిండిపోయి, భక్తి పరవశ వాతావరణం అలుముకుంది. ఈ పవిత్ర సందర్భంలో కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వామివారి దివ్య సన్నిధికి విచ్చేసి, పరమ భక్తి భావంతో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వామివారి పాదసేవను ఆచరించి దివ్య అనుగ్రహం, కృపాకటాక్షాలు పొందారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మల్లయ్య యాదవ్ కి గజమాలతో ఘన స్వాగతం పలికి సత్కరించారు. మహిళలు తిలకం దిద్ది స్వాగతం పలికారు. మల్లన్న అభిమానులు, యువకులు మల్లన్న, మల్లన్న అంటూ జాతరలో వసంతోత్సవం సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బొల్లం మల్లయ్య యాదవ్ చేతుల మీదుగా పుణ్యప్రదమైన మహా అన్నదాన సేవా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. స్వామివారి ప్రసాదంగా భావించి భక్తజనులకు భక్తి భావంతో అన్నసంతర్పణ నిర్వహించారు.

**ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.**

రేపాల గ్రామంలో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి మహిమ అపారమైందని, ఈ దివ్య క్షేత్రాన్ని దర్శించిన ప్రతి భక్తులపై స్వామివారి దివ్య అనుగ్రహం, ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. భక్తులందరికీ స్వామివారి శాంతి, సౌభాగ్యం, క్షేమం కలగాలని ఆకాంక్షించారు. ఈ మహోత్సవ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకొని భక్తుల కుటుంబాల సౌఖ్యం, సమృద్ధి, ఐశ్వర్యం కోసం పూజలు నిర్వహించామని తెలిపారు. స్వామివారి దివ్య కృపాకటాక్షాలు సమస్త భక్తజనులపై నిత్యం ప్రసన్నంగా ఉండాలని మనసారా ప్రార్థించారు. ఆలయం అంతా భక్తులతో జై లక్ష్మీనరసింహస్వామి జై అంటూ నినాదించారు. ఈ కార్యక్రమంలో రేపాల సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ, పల్లి ఆదిరెడ్డి,సారిక పెద్ద రామయ్య, గుండు దేవదాసు, గండు హనుమంతు,పోనుగోటి రంగా, మొగిలిచర్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించుకోవాలి

- ఈ నెల 6 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు షెడ్యూల్ విడుదల
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఎస్ రజిత తెలిపారు.



"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించు కోవాలని అన్ని వయసుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. నిర్దేశిత రోజులలో నాలుగు దశలలో నిర్వహిస్తామని వివరించారు. మొదటి దశలో మార్చి 6 నుండి మార్చి 31 వరకు గర్భిణీలు, వృద్ధులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సెంటర్ ద్వారా ఆరోగ్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, ఆర్ బీ ఎస్ కే బృందాలు, ఇతర వైద్య సిబ్బందికి గర్భిణీ స్త్రీలకు , తల్లులకు అందవలసిన పోషకాహారము, వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించడంతోపాటు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లపై ఆరోగ్య పరీక్షలు ప్రత్యేక వైద్య నిపుణుల ప్రసూతి స్త్రీ రోగనిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, నేత్ర, కీళ్ల ఎముకల, దంత వైద్య నిపుణులతో పాటు జనరల్ మెడిసిన్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన గర్భాశయ క్యాన్సర్ రాకుండా స్త్రీలకు హెచ్ పీవీ వ్యాక్సిన్ ఇస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో ఈ తేదీల్లో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**ఈ నెల (మార్చి )**

7వ తేదీన హనుమాజిపేట, 9వ తేదీన కోనరావుపేట, 10 వ తేదీన లింగన్నపేట, 11 వ తేదీన పోతుగల్, 12 వ తేదీన విలాసాగర్, 13 వ తేదీన ఎల్లారెడ్డిపేట, 14 వ తేదీన పెద్దలింగాపూర్, 16 వ తేదీన నేరెళ్ల, 17 వ తేదీన తంగళ్ళపల్లి, 18 వ తేదీన కొదురుపాక, 20 వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, 23 వ తేదీన సిరిసిల్లలోని అంబేద్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నగర్, 24వ తేదీన చీర్లవంచ, 25 వ తేదీన బోయినపల్లి, 26 వ తేదీన కోనరావుపేట,28 వ తేదీన పోతుగల్, 30 వ తేదీన విలాసాగర్, ఈ నెల (మార్చి) 31 వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య ఆరోగ్య శిబిరాలు, పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత తెలిపారు.

# కవిత నిర్దోషిత్వానికి తిరుమలలో మొక్కు తీర్చుకున్న జాగృతి నేతలు

- ధర్మమే గెలిచింది"... కవిత నిర్దోషిత్వానికి తిరుమలలో మొక్కు తీర్చుకున్న జాగృతి నేతలు
- అలిపిరి నుంచి తిరుమల వరకు పాదయాత్ర... పాల్గొన్న కొట్టాల యాదగిరి ముదిరాజ్




**నేటి సాక్షి గజ్వేల్ :** లిక్కర్ కుంభకోణం కేసులో కల్వకుంట్ల కవిత నిర్దోషిగా బయటపడిన నేపథ్యంలో ఆమె తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారికి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అలిపిరి నుండి తిరుమల వరకు భక్తి పూర్వకంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో గజ్వేల్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది, తెలంగాణ జాగృతి రాష్ట్ర వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు. గతంలో కవిత లిక్కర్ కేసు నుంచి నిర్దోషిగా బయటపడాలని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని మొక్కుకున్నామని ఆయన తెలిపారు. ఆ మొక్కు నెరవేరిన నేపథ్యంలో శుక్రవారం అలిపిరి మెట్లు మార్గం ద్వారా తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకొని మొక్కు చెల్లించుకున్నట్లు యాదగిరి ముదిరాజ్ వెల్లడించారు. కవితపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపితమైందని, అయినప్పటికీ చివరకు న్యాయం గెలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాగృతి వ్యవస్థాపకురాలు కవితపై అక్రమంగా కేసు నమోదు చేసినప్పటికీ చివరకు ధర్మమే గెలిచిందన్నారు. న్యాయవ్యవస్థపై సామాన్య ప్రజలకు ఉన్న విశ్వాసం మరింత బలపడిందని, కోర్టుల తీర్పులు నిజాన్ని వెలుగులోకి తీసుకువస్తాయని ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు. కవిత నిర్దోషిగా బయటపడటంతో ఆమె అభిమానులు, జాగృతి నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు, అనుచరులు కూడా ఈ పాదయాత్రలో పాల్గొని తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తి, ఆనందం మధ్య ఈ పాదయాత్ర ప్రత్యేకంగా నిలిచిందని వారు పేర్కొన్నారు.

# కత్రం చారిటబుల్ వైద్య సేవలు ప్రశంసనీయం



- బేతవోలులో ఆర్థో వైద్య శిబిరం విజయవంతం
- 231 మందికి వైద్యసేవలు

**నేటి సాక్షి. "చిలుకూరు.:** చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ప్రత్యేక ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. బేతవోలు సర్పంచ్ నాగయ్య ఈ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో అన్నిదానాల్లోకి ఆరోగ్యదానమే మిన్న అన్నారు. సమాజంలో ఎంతో మంది ధనవంతులు ఉన్నా అందరిలోనూ సేవగుణం ఉండదని, కానీ కత్రం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ రెడ్డి సామాన్య కుటుంబంలో పుట్టి ఉన్నతంగా ఎదిగినా మూలాలను మరువకుండా తన చుట్టూ ఉన్న వారికి సేవ చేయడం ప్రశంసనీయమన్నారు. సామాజిక బాధ్యతగా ప్రజారోగ్యం కోసం కత్రం శ్రీకాంత్ రెడ్డి చేస్తున్న ఆరోగ్యసేవలు అభినందనీయమన్నారు. ఆయన సేవలను మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ వైద్యశిబిరంలో మొత్తం 231మంది వైద్య సేవలు పొందారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. శిబిరానికి వచ్చినవారికి నిర్వాహకులు పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థో సర్జన్ డాక్టర్ పుట్టా వెంకటేష్, డాక్టర్ కావ్యశ్రీ, బేతవోలు సర్పంచ్ వట్టికూటి నాగయ్య. ఉప సర్పంచ్ ఏడుకొండలు, కత్రం చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు రామాంజనేయులు, కత్రం ఆరోగ్య సేవ కో-ఆర్డినేటర్ గౌతం రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



గంభీర్‌కు గర్ల్‌ఫ్రెండ్‌ను పరిచయం చేసిన

# హార్దిక్ పాండ్యా!

**ఢిల్లీ:** ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. ఈ మెగా ఫైనల్‌లో తలపడేందుకు టీమ్ ఇండియా శుక్రవారం (మార్చి 6) సాయంత్రం అహ్మదాబాద్ చేరుకుంది. సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై అద్భుత విజయం సాధించిన ఉత్సాహంలో ఉన్న భారత్, ఇప్పుడు కివీస్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమవుతోంది. ముంబైలో జరిగిన సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను 7 పరుగుల తేడాతో ఓడించిన టీమ్ ఇండియా, శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా తమ వ్యక్తిగత కార్లలో వెళ్లగా, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇతర ఆటగాళ్లు కలిసి హోటల్‌కు చేరుకున్నారు.


### వైరల్ అవుతున్న హార్దిక్ పాండ్యా వీడియో..

ముంబై ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, తన గర్ల్‌ఫ్రెండ్ మాహికా శర్మను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరిచయం చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. మాహికా శర్మ ఈ వరల్డ్ కప్ టోర్నీ అంతటా హార్దిక్ వెంటే ఉంటూ టీమిండియాను ప్రోత్సహిస్తున్నారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో హార్దిక్ కుమారుడు అగస్త్యతో కలిసి ఆమె మ్యాచ్ వీక్షించారు. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌లో భారత్ గెలిస్తే పలు ప్రపంచ రికార్డులు బద్దలవుతాయి. టీమిండియా ఈ ఫైనల్ మ్యాచ్ గెలిస్తే, టీ20 వరల్డ్ కప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గిన మొదటి జట్టుగా చరిత్ర సృష్టిస్తుంది. ఇప్పటి వరకు ఏ దేశం కూడా తమ సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్‌ను గెలవలేదు. భారత్ విజయం సాధిస్తే ఈ ఘనత సాధించిన తొలి దేశంగా చరిత్రపుటల్లో శాశ్వత కీర్తిని సొంతం చేసుకుంటుంది. ఇప్పటికే వరుసగా రెండు టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్ ఆడుతున్న మొదటి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. న్యూజిలాండ్ జట్టుకు నాకౌట్ మ్యాచ్‌ల్లో అద్భుతమైన రికార్డు ఉంది. పెద్ద మ్యాచుల్లో ఎప్పుడైనా గట్టి పోటీనిచ్చి ఫలితాన్ని తారుమారు చేసే సామర్థ్యం కివీస్‌కు ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, 1.30 లక్షల మంది ప్రేక్షకుల మధ్య హోమ్ గ్రౌండ్‌లో ఆడుతుండటం టీమిండియాకు అతిపెద్ద బలంగా చెబుతున్నారు.

# మహ్మద్ అమీర్ కన్నా ఊసరవెల్లి నయం

### భారత్ విజయంతో మాట మార్పు..

**ఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గురువారం ఇంగ్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో గెలిచింది. అయితే, భారత్ సెమీస్‌లో గెలవదు, అసలు సెమీస్‌కే చేరదు అంటూ పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ అమీర్ అవాకులు చెవాకులు పెలాడు. భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కాడు.ప్రస్తుతం భారత్ ఫైనల్స్‌కు చేరడంతో మాట మార్చాడు. సోషల్ మీడియాలో అమీర్‌పై నెటిజన్లు తెగ ట్రోలింగ్ చేస్తున్నారు. టీమిండియాను ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్ చేరిన తర్వాత అమీర్‌ను ఆయన చేసిన కామెంట్స్ గురించి ఓ టీవీ ఛానెల్ యాంకర్ ప్రశ్నించారు. దీనికి సమాధానంగా అమీర్ మాట్లాడుతూ..“ ఈ రోజు గుడ్ క్రికెట్ ఉంది, నేడు టీం ఇండియా పరిపూర్ణ క్రికెట్ ఆడింది. టీం ఇండియా గత మ్యాచ్‌లు చూస్తే ఇంగ్లాండ్ తో బాగా ఆడింది. ఇంగ్లాండ్ సంజూ శాంసన్ క్యాచ్ వదిలేసింది. అక్షర్ పటేల్ రెండు మంచి క్యాచ్‌లు పట్టుకున్నాడు. అక్షర్ క్యాచ్ పట్టకపోతే ఇంగ్లాండ్ ఒక ఓవర్ మిగిలి ఉండగానే మ్యాచ్ గెలిచేది” అని చెప్పాడు. గతం సూపర్-8లో ఇండియా వర్సెస్ వెస్టిండీస్ కీలక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలవదని, వెస్టిండీస్ సెమీస్ కు వెళ్తుందని ఆమీర్ అన్నారు. కానీ,అతడి అంచనాలు తప్పని తేలింది. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి సెమస్‌కు చేరింది. సెమీస్‌లో ఇంగ్లాండ్ గెలుస్తుందని మళ్లీ ఓ జోస్యం చెప్పాడు. చివరకు భారత్ ఘన విజయం సాధించి ఫైనల్‌లో నిలిచింది. అమీర్ వ్యాఖ్యలు చేయడం, ఆయన వ్యాఖ్యలు తప్పని భారత్ నిరూపించడం జరుగుతూనే ఉంది. కానీ, గెలిచిన తర్వాత మాట మార్చడం చూస్తున్న భారత ఫ్యాన్స్ మాత్రం నీకన్నా ఊసరవెల్లి నయం కదా అని అనుకుంటున్నారు.




# బుమ్రా కూడా మనిషే..

- న్యూజిలాండ్ ప్లేయర్ కీలక వ్యాఖ్యలు
- డెత్ ఓవర్లలో బుమ్రా యార్కర్లు పెద్ద సవాల్
- లూజ్ బాల్ వస్తే బౌండరీకి పంపేందుకు సిద్ధం: కివీస్ వ్యూహం
- వరుణ్ చక్రవర్తి స్పిన్ కూడా సవాల్




**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీకి తెరపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గ్లెన్ ఫిలిప్స్, భారత బౌలింగ్ విభాగాన్ని, ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బుమ్రాను ఒక ‘ప్రపంచ స్థాయి ఆపరేటర్’గా అభివర్ణించిన ఫిలిప్స్, అతని వద్ద ఉన్న వైవిధ్యమైన బంతులు, ముఖ్యంగా డెత్ ఓవర్లలో అత్యంత ఖచ్చితత్వంతో వేసే యార్కర్లు ఏ బ్యాటర్ కైనా సవాలేనని అంగీకరించారు. అయితే, బుమ్రా అజేయుడేమీ కాదని, మిగిలిన ఆటగాళ్లలాగే అతను కూడా మనిషేనని, అతనికీ ఏదో ఒక రోజు తడబడే అవకాశం ఉంటుందని ఫిలిప్స్ వ్యాఖ్యానించారు. “బుమ్రా అత్యుత్తమ బౌలర్ అనడంలో సందేహం లేదు, కానీ అతను కూడా మనిషే. అందరిలాగే అతనికి కూడా ‘బ్యాడ్ డే’ ఉండొచ్చు. ఆ రోజు (ఫైనల్ మ్యాచ్) అతనికి అలాంటి రోజే కావాలని మేము కోరుకుంటున్నాము” అని ఫిలిప్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో బుమ్రా 18వ ఓవర్ వేసి కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చి భారత్ విజయానికి బాటలు వేసిన తీరును ఆయన గుర్తు చేశారు. బుమ్రా వేసే 4 ఓవర్లను కేవలం డిఫెన్స్ ఆడుతూ వదిలేయలేమని, అతను పొరపాటున లూజ్ బాల్ వేస్తే దానిని బౌండరీకి తరలించడానికి తాము సిద్ధంగా ఉన్నామని కివీస్ వ్యూహాన్ని బయటపెట్టారు. ఒకవేళ బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో కట్టడి చేస్తే, దానికి తగ్గట్లుగా మైదానంలోనే తమ ప్రణాళికలను మార్చుకుంటామని ఫిలిప్స్ స్పష్టం చేశారు. కేవలం బుమ్రా మాత్రమే కాకుండా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎదుర్కోవడం కూడా తమకు కీలకమని ఫిలిప్స్ పేర్కొన్నారు. గత ద్వైపాక్షిక సిరీస్‌లలో వరుణ్‌ను ఎదుర్కొన్న అనుభవం తమకు ఉందని, బంతిని బట్టి ఆడుతూ ఒత్తిడిని అధిగమిస్తామని చెప్పారు. లక్షలాది మంది భారత అభిమానుల మధ్య, డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌ను వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం ‘డేవిడ్ ఒం గోలియత్’ పోరాటంలా ఉంటుందని, కానీ తమ జట్టుకు ఒత్తిడిని తట్టుకుని నిలబడటం తెలుసని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో 2021 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన జ్ఞాపకాలను కివీస్ జట్టు గుర్తు చేసుకుంటోంది. ఆదివారం జరగబోయే ఈ అమీతుమీ పోరులో బుమ్రా తన ప్రతాపం చూపిస్తాడా లేక ఫిలిప్స్ ఆశించినట్లుగా కివీస్ పైచేయి సాధిస్తుందా అన్నది వేచి చూడాలి.

భారత్-న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్ రద్దయితే

# విజేత ఎవరు?





**ఢిల్లీ:** 2026 టీ20 ప్రపంచ కప్ ఫైనల్ సమరానికి సర్వం సిద్ధమైంది. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ ఉ న్యూజిలాండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. అయితే, ఈ మెగా ఫైనల్‌కు వర్షం ముప్పు పొంచి ఉంటే విజేతను ఎలా నిర్ణయిస్తారు? ఐసీసీ నిబంధనలు ఏం చెబుతున్నాయి? పూర్తి వివరాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగితే ఫలితం కోసం ఐసీసీ కింది నిబంధనలను అమలు చేస్తుంది.**

**రిజర్వ్ డే :** మార్చి 8న వర్షం కారణంగా మ్యాచ్ సాధ్యం కాకపోయినా లేదా అసంపూర్తిగా ఆగినా, మరుసటి రోజు అంటే మార్చి 9ని ‘రిజర్వ్ డే’గా కేటాయించారు.

**ఆగిన చోటు నుంచే..:** ఒకవేళ మార్చి 8న టాస్ పడి, కొంత ఆట జరిగిన తర్వాత వర్షం పడితే, రిజర్వ్ డే నాడు మ్యాచ్ మళ్లీ మొదటి నుంచి కాకుండా ఆగిపోయిన పాయింట్ నుంచే కొనసాగుతుంది.

**అదనపు సమయం:** మ్యాచ్ పూర్తి చేయడానికి వీలుగా రెండు రోజులూ 120 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. ఓవర్ల తగ్గింపు ద్వారా అయినా ఫలితం రాబట్టేందుకు అంపైర్లు ప్రయత్నిస్తారు.

కనీస ఓవర్లు: ఫైనల్ ఫలితం తేలాలంటే రెండు జట్లు కనీసం 10 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది.

### ఒకవేళ రెండు రోజులూ ఆట సాధ్యం కాకపోతే..

దురదృష్టవశాత్తూ మార్చి 8, 9 తేదీల్లో కూడా వర్షం కారణంగా మ్యాచ్ పూర్తి కాకపోతే, ఐసీసీ నిబంధనల ప్రకారం భారత్ ఉ న్యూజిలాండ్ జట్లను ‘సంయుక్త విజేతలు’గా ప్రకటిస్తారు. గతంలో 2002 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్-శ్రీలంక మధ్య ఇలాగే టైటిల్‌ను పంచుకోవడం జరిగింది. అయితే టీమ్ ఇండియా వరుసగా రెండోసారి టీ20 ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించాలని పట్టుదలతో ఉంది. ఇప్పటివరకు ఏ జట్టు కూడా వరుసగా రెండు టైటిళ్లు నెగ్గలేదు. కానీ ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్‌పై భారత్‌కు అంత మంచి రికార్డు లేదు. ఇప్పటివరకు టీమ్ ఇండియా టీ20 ప్రపంచ కప్‌లో కివీస్‌ను ఓడించలేదు. ఈసారి ఆ రికార్డును తిరగరాయాలని టీమిండియా భావిస్తోంది. ఇదే సమయంలో తొలిసారి టీ20 ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడాలని న్యూజిలాండ్ కూడా ఎంతో కసితో ఉంది.

# సంజు శాంసన్ సూపర్ ఫామ్ వెనుక సీక్రెట్

### బయటపెట్టిన టీమిండియా మాజీ కోచ్

**ఢిల్లీ:** కీలక మ్యాచ్‌లలో టీమిండియాను గట్టు ఎక్కించింది




సంజు శాంసన్.. అసలు.. సంజు.. సూపర్ నాక్ లేకపోతే.. భారత్ ఫైనల్‌కు చేరేదా? అంటే లేదనే చెప్పాలి.. అయితే, ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న సంజుకు ఇంటి సూపర్ ఫామ్ ఎలా సాధ్యమైంది..? అనేది ఇప్పుడు చర్చ.. 2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ సంజు శాంసన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. కీలక మ్యాచ్‌లలో అతను ఆడిన ఇన్నింగ్స్‌లు టీమ్ ఇండియాకు విజయాన్ని అందించడంలో ముఖ్య పాత్ర పోషించాయి. ముఖ్యంగా వెస్టిండీస్ మరియు ఇంగ్లాండ్‌పై సంజు చేసిన బ్యాటింగ్ అభిమానులను ఆకట్టుకుంది.

ఇప్పుడు టైటిల్ పోరులో భారత్ మరియు న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్ మార్చి 8న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ కోచ్ రవి శాస్త్రి.. సంజు శాంసన్ సూపర్ ఫామ్ వెనుక ఉన్న అసలు సీక్రెట్‌ను బయట పెట్టాడు..

### వెస్టిండీస్‌పై అద్భుత ఇన్నింగ్స్

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి అజేయంగా 97 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ కారణంగా భారత్ చిరస్మరణీయ విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో సంజు తన క్లాస్ మరియు ఆత్మవిశ్వాసాన్ని చూపించాడు.

### ఇంగ్లాండ్‌పై పేలుడు ఇన్నింగ్స్

సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా సంజు అద్భుత ప్రదర్శన చేశాడు. అతను 89 పరుగుల విలువైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. భారత్ ఆ మ్యాచ్‌లో 253/7 స్కోరు చేసి చివరికి 7 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం విదితే..

### రవిశాస్త్రి బయట పెట్టిన సంజు విజయ రహస్యం

ఐసీసీ షో రివ్యూలో మాట్లాడిన రవిశాస్త్రి, సంజు విజయానికి ప్రధాన కారణం అతని మానసిక మార్పు మరియు స్థిరత్వం అని చెప్పారు. “సంజు శాంసన్ కు ప్రతిభ ఎప్పటినుంచో ఉంది.. కానీ, ప్రతిభ ఒక్కటే సరిపోదు. స్థిరంగా ప్రదర్శన ఇవ్వడం కూడా చాలా ముఖ్యం. గతంలో అతను కొన్ని సార్లు తప్పు షాట్ ఎంపిక వల్ల పెద్ద స్కోర్లు చేయలేకపోయాడు. ఇప్పుడు అతను తన ఆటను మరింత పరిపక్వంగా మార్చుకున్నాడు అని తెలిపారు. సంజు ప్రతిభపై ఎప్పుడూ సందేహం లేదని రవిశాస్త్రి చెప్పారు. అయితే గతంలో స్థిరత్వం లేకపోవడం వల్ల అభిమానులు కొంత నిరాశ చెందారని అన్నారు. ప్రస్తుతం 31 ఏళ్ల వయసులో సంజు మరింత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడు. ఇప్పుడు అతను తన షాట్ ఎంపికలో జాగ్రత్తగా ఉండటం, తన బలాలపై నమ్మకం పెట్టుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధిస్తున్నాడని శాస్త్రి తెలిపారు.మొత్తంగా టోర్నమెంట్ ప్రారంభంలో సంజు పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. నమీబియా మరియు జింబాబ్వేతో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లలో అతను పెద్ద స్కోర్లు చేయలేదు. దీంతో అతని జట్టులో స్థానం గురించి కూడా ప్రశ్నలు వచ్చాయి. అయితే కీలక సమయంలో సంజు తన అసలైన ప్రతిభను చూపించాడు. వెస్టిండీస్ మరియు ఇంగ్లాండ్‌పై అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడి విమర్శకులకు సమాధానం ఇచ్చాడు. ఇప్పుడు టీమ్ ఇండియా టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఉంది. ఫైనల్‌లో సంజు శాంసన్ ఇదే ఫామ్ కొనసాగిస్తే భారత్‌కు కప్ గెలిచే అవకాశాలు మరింత పెరుగుతాయి.




## పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకున్న జాన్వీ

జాన్వీ కపూర్ తన పుట్టినరోజు సందర్భంగా కలియుగ దైవం శ్రీవారిని దర్శించుకున్నారు. మార్చి 6 తన 29వ పుట్టినరోజును పురస్కరించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం కాలిబాటన తిరుమలకు చేరుకున్నారు. తన పిన్ని నటి మహేశ్వరితో మెట్లమార్గంలో కొండపైకి చేరుకున్న జాన్వీ తెల్లవారుజామున వి.ఐ.పి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకుంది. దర్శనం అనంతరం జాన్వీకి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందించారు. సాంప్రదాయ పట్టు వస్త్రాల్లో మెరిసిపోతున్న జాన్విని చూసేందుకు భక్తులు ఎగబడగా, ఆమె ఎంతో ఓపికతో వారితో సెల్ఫీలు దిగుతూ కన్పించారు. ప్రస్తుతం తెలుగు సినిమాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈ భామ, ఇప్పటికే 'దేవర' చిత్రంతో అదరగొట్టి, త్వరలో రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రాబోతున్న భారీ చిత్రం 'పెద్ది' ద్వారా ప్రేక్షకులను పలకరించనున్నారు.



# ఆసక్తిగా సాగే.. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'




టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ సుదీర్ఘ విరామం తర్వాత జంటగా నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రైమ్ కామెడీ డ్రామాను శివాజీ స్వయంగా నిర్మించారు. భారీ అంచనాల మధ్య శుక్రవారం విడుదలైంది. హార్సిలి హిల్స్‌లో నివసించే శ్రీరామ్ (శివాజీ) ఒక నిజాయితీ గల పంచాయతీ కార్యదర్శి. తన భార్య ఉత్తర (లయ), రీల్స్ పిచ్చితో వింత పనులు చేసే కొడుకు నితిన్ అలియాస్ బిట్టు (రోహన్)తో కలిసి సాధారణ జీవితం గడుపుతుంటాడు. అయితే, ఆడవాళ్ల పిచ్చి ఉన్న స్థానిక ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్), శ్రీరామ్ లేని సమయంలో ఉత్తరపై కన్నేసి వారి ఇంటికి వస్తాడు. కానీ ఊహించని విధంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. ఆ హత్య కేసు నుండి తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి శ్రీరామ్ ఏం చేశాడు? శవాన్ని మాయం చేసే క్రమంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులేంటి? మరోవైపు కోటి రూపాయల గిఫ్ట్ బ్యాగ్ కోసం ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట ఎందుకు పడింది? ఈ గందరగోళంలో కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్) పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం. దర్శకుడు సుధీర్ శ్రీరామ్ ఒక డార్క్ క్రైమ్ థ్రిల్లర్‌ను వినోదాత్మకంగా మలచడంలో సఫలమయ్యాడని చెప్పవచ్చు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినప్పటికీ, పాత్రల చిత్రణ మరియు కథనాన్ని నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సినిమా ఆరంభంలో పాత్రల పరిచయం, ఆ తర్వాత వచ్చే మలుపులు ప్రేక్షకుడిని కథలోకి తీసుకెళ్తాయి. అయితే ఎప్పుడైతే హత్య జరుగుతుందో, అక్కడి నుండి కథ థ్రిల్లింగ్ మోడ్‌లోకి మారుతుంది. శవాన్ని మాయం చేసేందుకు హీరో వేసే ప్లాన్లు, మరోవైపు ఎమ్మెల్యే మనుషుల నుంచి తప్పించుకునే సీన్లు ఆసక్తిని కలిగిస్తాయి. అయితే, ద్వితీయార్థంలో అక్కడక్కడా కథనం కాస్త నెమ్మదించినట్లు అనిపిస్తుంది. శివాజీ తనదైన టైమింగ్ మరియు అనుభవంతో శ్రీరామ్ పాత్రలో ఒదిగిపోయారు. మధ్యతరగతి తండ్రి పడే తపనను చక్కగా పండించారు. చాలా కాలం తర్వాత తెరపై కనిపించినా, తన నటనతో అలరించింది లయ. ఇక కొడుకు పాత్రలో రోహన్ తన అల్లరితో నవ్వించగా, ధనరాజ్ పాత్ర చివరిలో సర్ప్రైజ్ చేస్తుంది. శరత్ లోహితాశ్వ, ప్రిన్స్ తమ పరిధి మేరకు నటించారు.

# పెద్ది నుంచి జాన్వీకపూర్ వీడియో విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'లో కథానాయిక జాన్వీ కపూర్ ఈరోజు తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్విని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ 'అచియమ్మ' అనే పాత్రలో కనిపించబోతోంది. బుచ్చిబాబు తన ట్వీట్‌లో.. 'నీతో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. స్క్రీన్ మీద అచియమ్మగా నీ పవర్‌ఫుల్ అవతారాన్ని ప్రపంచం చూడబోతున్నందుకు నేను చాలా ఎ÷–జగైటెడ్‌గా ఉన్నాను' అంటూ పేర్కొన్నారు. విడుదలైన పోస్టర్‌లో జాన్వీ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. గతంలో శ్రీదేవి – చిరంజీవి జోడీ వెండితెరపై సృష్టించిన మ్యాజిక్ గురించి తెలిసిందే. ఇప్పుడు వారి వారసులు రామ్ చరణ్ – జాన్వీ కపూర్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# మాస్ రోల్‌లో శర్వానంద్..షో




ఇటీవలే 'నారీ నారీ నడుమ మురారి'తో క్లాస్ హిట్ అందుకున్న శర్వానంద్, ఇప్పుడు రూట్ మార్చి పూర్తి స్థాయి మాస్ రోల్‌లో కనిపించబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంలో నటిస్తుండగా. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'ధమాకా' ఫేమ్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండటంతో పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన శర్వానంద్ లుక్ చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద ఈసారి మాస్ జాతర ఖాయమనిపిస్తోంది. దీనికి తోడు నేడు శర్వానంద్ పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఒక స్పెషల్ రఫ్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు సంపత్ నంది ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'మొన్న గంగని చూశారు.. ఇప్పుడు పెను గంగని చూడండి' అంటూ తన హీరో క్యారెక్టర్‌కు పవర్‌ఫుల్ ఎలివేషన్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో శర్వానంద్ గడ్డంతో, ఇంటెన్స్ లుక్‌లో చాలా డైనమిక్ గా కనిపిస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లోనే ఇది మోస్ట్ మాస్ ఫిల్మ్ అవుతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక శ్రీ శ్రీనివాస సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 28, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రజంట్ శర్వ లుక్ వైరల్ అవుతుంది.



# వృషకర్మ గ్లింప్స్ అద్భుతం: సుకుమార్

యువసామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్ చూసిన ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. సుకుమార్ రైటింగ్స్ కూడా ఈ నిర్మాణంలో భాగస్వామి కావడంతో, ఆయన ఈ అవుట్‌పుట్ పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.సుకుమార్ అభినందనలపై నాగచైతన్య ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందిస్తూ.. 'థాంక్యూ సుకుమార్ గారు. మీలాంటి విజనరీ నుంచి ఇలాంటి మాటలు రావడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. మీ ప్రశంసలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక్ దండు రూపొందించిన ఈ సూపర్ నేచురల్ ప్రపంచం సుకుమార్‌ను సైతం ఆశ్చర్యపరిచిందని చైతూ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోంది. గతంలో కార్తీక్ దండు రూపొందించిన 'విరూపాక్ష' చిత్రానికి సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'వృషకర్మ'తో తన శిష్యుడు మరో అద్భుతాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడని సుకుమార్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. దీంతో ఈ గురు–శిష్యుల బాండింగ్.. చైతన్యతో వారి అనుబంధం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరగాలి

**చిలుకూరు ఎస్ఐ హనుమాన్ నాయక్**



**నేటి సాక్షి,చిలుకూరు :** విద్యార్థులు చదువులో చురుకుగా ఉంటూ నిరంతర సాధన చేస్తే లక్ష్యాలను ఆదుపుచ్చుకోవచ్చని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఎస్సై హనుమా నాయక్ తెలిపారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో గల పరిషత్ పాఠశాల ను ఎస్సై సిబ్బందితో కలిసి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడి వారిలో ఆత్మవిశ్వాసం ధైర్యం కల్పించారు. లక్ష్యం కోసం నిరంతర సాధన చేయాలని శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి మంచి ఫలితాలు సాధించాలని. నిరంతర సాధన చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుతారని క్రింది స్థాయిలోనే కష్టపడటం అలవాటైతే పై తర్వాతులకు పోతే సులభతరం అవుతుందని గుర్తు చేశారు.

# చెత్త డంపింగ్ యార్డ్ ను తొలగించండి....

**ఇబ్రహీంపట్నం గ్రామ సర్పంచ్ నాగరాణి....**



**నేటి సాక్షి,నారాయణపేట, మార్చ్ 6, (రిపోర్టర్ ఇమామ్ సాబ్ ) :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని ఇబ్రహీంపట్నం గ్రామ సమీపంలో గల మరికల్ చెత్త డంపింగ్ యార్డ్ ను వెంటనే తొలగించాలని ఇబ్రహీంపట్నం గ్రామ సర్పంచ్ నాగరాణి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాగరాణి మాట్లాడుతూ మరికల్ చెత్త డంపింగ్ యార్డ్ వల్ల దుర్వాసన వెదజల్లుతుందన్నారు.ఈ వాసన భరించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చెత్త డంపింగ్ యార్డ్ ను తొలగించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు సర్పంచ్ వెంట ఉప సర్పంచ్ మునిస్వామి ఇబ్రహీంపట్నం గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిగుల్ లో కంటి వైద్య శిబిరం



**నేటిసాక్షి : మార్చి 06 జగదేవపూర్ :** జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో వాసవి కంటి వైద్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ పరశురామ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరం వల్ల వృద్ధులకు కంటి సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. గ్రామాల్లో పేదలు కార్పొరేట్ హాస్పిటల్ లో డబ్బులు పెట్టి వైద్యం చేయించుకోలేరని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు వారికి వరం లాంటివి అన్నారు. గ్రామాల్లో పేదలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాసవి కంటి వైద్య సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీలో గంజాయి స్వాధీనం

**ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**నేటి సాక్షి, ఎండపల్లి:** వెల్గటూర్ మండలం జగదేవపేట గ్రామ శివారులో పోలీసులు గంజాయి తరలింపును అడ్డుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వెల్గటూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కొండాపూర్ గ్రామానికి చెందిన బోరకుంట వెంకటేష్, కనుకుంట్ల కళ్యాణ్ అనే వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా సుమారు 60 గ్రాముల నిషేధిత గంజాయి లభ్యమైంది. దీంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకొని వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత ఎలాంటి మత్తు పదార్థాలు, గంజాయి మరియు మాదకద్రవ్యాలకు బానిస కాకూడదని సూచించారు. నిషేధిత గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను ఎవరైనా వినియోగించినా, సరఫరా చేసినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి లేదా మాదకద్రవ్యాల గురించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# బహిరంగ వేలం...ప్రశాంతంగా సాగిన లైసెన్స్ హక్కుల వేలం

- **బోయకొండ గంగమ్మ దేవస్థానంలో రెండో రోజు బహిరంగ వేలం ప్రశాంతంగా సాగిన లైసెన్స్ హక్కుల వేలం.**



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి మార్చి 6 :** చౌడేపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో వివిధ లైసెన్స్ హక్కుల కేటాయింపునకు దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలం రెండో రోజు కూడా ప్రశాంత వాతావరణంలో జరిగింది. గురువారం దేవస్థానం కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ వేలానికి భక్తులు, వ్యాపారులు, డిపాజిట్ దారులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీగా పాల్గొన్నారు.ఈ వేలం ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.24,21,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ, ఉప కమిషనర్ జె. ఏకాంబరం తెలిపారు. ప్రతి లైసెన్స్ హక్కుకు పోటీగా బిడ్లు పడటంతో వేలం ఉత్సాహభరితంగా సాగిందన్నారు. దేవస్థానం పరిసర ప్రాంతాలలో అమ్మవారికి భక్తులు సమర్పించే కొబ్బరికాయల పైచిప్పలను సేకరించుకునే హక్కును కె. మల్లికార్జున రూ.7,70,000లకు దక్కించుకున్నారు. దేవస్థానం పరిసర ప్రాంతంలో స్టీల్, రాగి, ఇత్తడి ప్లేట్లు, జోతులు, హారతి పళ్లెం వంటి పూజా సామగ్రి విక్రయించే హక్కును సోము రూ.90,000లకు పొందారు.అలాగే కొండ కింద కోళ్ల విక్రయ హక్కును ఆర్. పవన్ రూ.7,00,000లకు సొంతం చేసుకున్నారు. భక్తులకు అవసరమైన పేపర్ కవర్లు, బ్యాగులు విక్రయించే హక్కును సి. గజేంద్ర రూ.6,70,000లకు కైవసం చేసుకున్నారు.దేవస్థానంలో ఫోటోలు తీసుకునే హక్కుకు జరిగిన వేలంలో కిరణ్ రూ.1,91,000కు హెచ్చుపాటుగా బిడ్ వేయడంతో ఆ హక్కును పొందారు.ఇంకా కొన్ని లైసెన్స్ హక్కులకు ఎవరూ హాజరుకాకపోవడంతో ఆ హక్కుల వేలాన్ని తరువాతి తేదీకి వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, ఉప కమిషనర్ జె. ఏకాంబరం, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు గంగిరెడ్డి, సుధాకర్, చౌడేపల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ చిన్నరెడ్డెప్ప, పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది, డిపాజిట్ దారులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల నిధులు కాగితాలకే పరిమితం: డిబిఎఫ్ మండిపాటు



- **అంబేద్కర్ అభయహస్తం ప్రారంభించాలి -- చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్**

**నేటి సాక్షి గజ్వేల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల చట్టం కింద కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం, వివక్షత ప్రదర్శిస్తోందని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి విమర్శించారు.శుక్రవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ భవన్‌లో డిబిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని తక్షణమే ప్రారంభించడంతో పాటు చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ 2025--26 బడ్జెట్‌లో దళితుల ప్రత్యేక నిధి కింద రూ.40,231 కోట్లు కేటాయించగా, అందులో రూ.16,374 కోట్లు మాత్రమే విడుదల చేశారని, వాటిలో కూడా కేవలం రూ.6,726 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఇది దళితుల అభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందని అన్నారు. డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఎస్సీ యాక్షన్ ప్లాన్ విడుదల చేయలేదని పేర్కొన్నారు. కళాకారుడు గిరిపల్లి మల్లేశం మాట్లాడుతూ స్వయం ఉపాధి ఆర్థిక పథకాలు అమలు కాకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎస్సీల జనాభా ప్రకారం 18 శాతం రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. ఎస్టీల ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.17,154 కోట్లు కేటాయించగా, కేవలం రూ.3,431 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వెల్లడించారు.బీఎస్పీ నాయకుడు కనకప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగబద్ధ హక్కుల అమలుకోసం బడ్జెట్ నిధుల కేటాయింపు, ఖర్చుల విషయంలో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బెజగామా ప్రభాకర్, చంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ తీవ్ర విమర్శలు



- **హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **6 హామీలు, 13 వాగ్దానాలు... ఒక్కటీ అమలు కాలేదని ఆగ్రహం**
- **రైతు భరోసా, పెన్షన్లు, మహిళలకు నగదు -- అన్నీ మాటలకే పరిమితం**
- **కమిషన్ల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం అంటూ ఆరోపణలు**
- **రైతులు, యువత, మహిళలు -- ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శ**

**నేటి సాక్షి మహబూబాబా ద్ మార్చి 6 :** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు తీపి మాటలు చెప్పి అధికారాన్ని దక్కించుకున్నారని, ఇప్పుడు అదే ప్రజలను పూర్తిగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు.ప్రజలకు 6 హామీలు, 13 వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటిలో ఒక్కటినైనా పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. మొత్తం 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులకు అందించాల్సిన రైతు భరోసా ఇప్పటికీ ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ఎలాంటి చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. అలాగే వృద్ధులకు ప్రస్తుతం ఉన్న ₹2000 పెన్షన్‌ను ₹4000 చేస్తామని, వికలాంగులకు ఉన్న ₹4000 పెన్షన్‌ను ₹6000 చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించి ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. చదువుకునే యువతులకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్కరికైనా ఇవ్వలేదని అన్నారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ₹2500 ఇస్తామని ప్రకటించినా ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని తెలిపారు. విద్యార్థుల కోసం విద్యా భరోసా పథకం కింద ₹5 లక్షలు ఇస్తామని చెప్పిన మాట కూడా కేవలం ఎన్నికల హామీగానే మిగిలిపోయిందని విమర్శించారు. అలాగే భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి ₹12000 ఇస్తామని చెప్పిన వాగ్దానం కూడా అమలు కాలేదని అన్నారు. ఆటో కార్మికులు తమ జీవితం రోడ్డుపై పడిందని మొరపెట్టుకుంటున్నా ఈ ప్రభుత్వం కనీసం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే గ్యాస్ సిలిండర్‌పై ₹500 సబ్సిడీ ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి కేవలం కాంట్రాక్టర్ల దగ్గర 10 నుండి 15 శాతం కమిషన్లు వసూలు చేయడానికే పనిచేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. డబ్బు సంచుల కోసం ఢిల్లీకి మూటలు పంపడానికే ప్రభుత్వం పనిచేస్తోందని కూడా వ్యాఖ్యానించారు. రైతులకు డబ్బులు లేవని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నది సుందరీకరణ పేరుతో సుమారు ₹1.5 లక్షల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవుతుందంటే రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని విమర్శించారు. దళితులకు ₹12 లక్షల దళితబంధు ఇస్తామని చెప్పిన హామీ కూడా అమలు కాలేదని, అలాగే మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో సరైన నీటి సరఫరా కూడా అందడం లేదని అన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు మళ్లీ ప్రారంభమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇవ్వాల్సిన పంట బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వచ్చే బడ్జెట్‌లో అయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని, ప్రజలను భక్షించే ప్రభుత్వం అంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈ ప్రభుత్వానికి కూల్చడంలో ఉన్న శ్రద్ధ నిర్మాణంలో లేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలోబి ఆర్ ఎస్ జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, బి ఆర్ ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్, కురవి దేవాలయ మాజీ చైర్మన్ బాదావత్ రాజు నాయక్, మండల ప్రధాన కార్యదర్శి నూతక్కి సాంబశివరావు, దీ=ా నాయకులు కొణతం విజయ్, బోడ శ్రీను, బండి యతిరాజు, గుగులోతు నెహ్రూ నాయక్, కంచర్ల గూడెం గ్రామ సర్పంచ్ బానోతు రమేష్, బలపాల గ్రామ దీ=ా అధ్యక్షుడు నామా సైదులు, కురవి మాజీ ఉప సర్పంచ్ సంగెం భరత్, మాజీ వార్డు సభ్యులు ఇరుగు వెంకన్న, సోషల్ మీడియా ఇంచార్జి దడిగల రవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో ప్రతిష్టత్మాకంగా చేపట్టిన ప్రజా పాలనా

## ప్రగతి ప్రణాళిక 99 రోజు ల కార్యక్రమంలో భాగంగా.




**నేటి సాక్షి వికారాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, 5వ థీమ్ అయిన పిల్లల భద్రత డ్రగ్స్ నిర్మూలన పై వికారాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలను చైతన్యపరిచారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని 4 గ్రామాల చొప్పున, జిల్లా వ్యాప్తంగా మొత్తం 80 గ్రామాలలో ఈ అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా అధికారులు డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, యువత వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును ఎలా నాశనం చేసుకుంటున్నారో సోదాహరణంగా వివరించారు. పరిగి సబ్ డివిజన్‌లోని కొడంగల్ పట్టణంలో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా హాజరై భారీ 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం పరిగి నియోజకవర్గ పరిధిలోని మాదారం గ్రామంలో ఈగల్ టీమ్ డైరెక్టర్‌తో కలిసి ఎస్పీ నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యార్థులు "గుడ్ టచ్ – బ్యాడ్ టచ్" పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. దోమ మండలంలోని దోమ, దిర్సంపల్లి గ్రామాలలో; కుల్కచర్ల, బందేన్ కిచర్ల గ్రామాలలో చెంగోముల్ పరిధిలోని మన్నెగూడ, పుదూర్, మీర్జాపూర్ గ్రామాలలో ఆయా పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీలు, సదస్సులు ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించారు.

తాండూరు సబ్ డివిజన్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, కరణ్‌కోట్ పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో యువత కోసం ప్రత్యేకంగా వాలీబాల్ మరియు క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యాలాల మండలంలోని రాస్నం, అగనూర్ గ్రామాలలో మరియు పెద్దేముల్ మండలంలోని వివిధ గ్రామాలలో ర్యాలీలు, సదస్సులు మానవ హారాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపారు.

వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వాకర్స్‌తో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. మోమిన్‌పేట్ మండలంలోని మేకవనంపల్లి, ఎన్కతల, మొరంగపల్లి గ్రామాల్లోని పాఠశాలలు రైతు వేదికల వద్ద ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, నార్కోటిక్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1908 పై అవగాహన కల్పించారు. అలాగే నవాబుపేట మండలంలోని పుల్మామిడి, దాతాపూర్ మోడల్ స్కూల్; ధారూర్, నాగసముందర్ గ్రామాలు; కోటపల్లి, ఎన్నారం గ్రామాలు; మరియు బంట్వారం మోడల్ స్కూల్, తు-రుమామిడి గ్రామాలలో ఆయా పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీలు, సదస్సులు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ అవగాహన సదస్సులలో అధికారులు ముఖ్యంగా 'షీ టీమ్స్' (షీ టీమ్స్ ) ప్రాముఖ్యతను బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి ఉద్దేశించిన పోక్సో (పోక్సో) చట్టం గురించి, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామాలలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆటపాటల వైపు మళ్లాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని సీనియర్ పోలీస్ అధికారులు, ఈగల్ టీమ్ అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధిలో మాతో పాటు మీరు భాగస్వామ్యులు కావాలి

## ఎమ్మెల్యే బిఎల్ఆర్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతంగా ఏర్పాటైన నూతన కౌన్సిల్ సభ్యులతో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై శుక్రవారం మొట్ట మొదటి సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుధా బాలు, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా 29వ వార్డ్ కౌన్సిలర్ జావిద్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులు తమ విభాగలను తెలియజేస్తూ, పరిచయం చేసుకున్నారు. అనంతరం నూతనంగా గెలుపొందిన కౌన్సిలర్స్ తమ వార్డ్ లలో ఉన్న ప్రధాన సమస్యలను అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలిపి, పార్టీలకు అతీతంగా, పట్టణంలోని అన్ని వార్డులు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, అలాగే మీరంతా పట్టణ అభివృద్ధిలో మాతో పాటు భాగస్వామ్యులు కావాలని కోరారు. 48 వార్డుల కౌన్సిలర్స్ అందరితో కలిపి ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయడం జరుగుతుందని, తమ వార్డ్ లో ఉన్న సమస్యలు ఎలాంటివి ఐనా నేరుగా గ్రూప్ లో ప్రశ్నించవచ్చుని, దాని పరిష్కారం కూడా వెంటనే చేసి కమిషనర్, చైర్మన్ తమకి స్పందిస్తారు అని అన్నారు. అలాగే పరిపాలన విధానం ప్రజలకు తెలియజేసేందుకు, ప్రజాస్వామ్యం కాపాడెందుకు ఇకనుంచి కౌన్సిల్ సమావేశానికి గుర్తింపు కలిగిన మీడియా మిత్రులకు కూడా ఆహ్వానం ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు.రానున్న రెండు సంవత్సరాలలో మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించబోయే పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి కౌన్సిలర్స్ కి వివరించారు. అనంతరం కౌన్సిలర్స్ మరియు చైర్మన్, వైస్ ఛైర్మన్ మొదటగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజ్ఞాపూర్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

## పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింల భక్తి ప్రార్ధనలు



**నేటి సాక్షి గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ గ్రామంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రంగా భావించే ఈ రంజాన్ మాసంలో ముస్లింలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఆత్మశుద్ధి, నియమ నిష్ఠలతో జీవించాలని సంకల్పిస్తారు. ఈ పవిత్ర నెలలో మనుషులు చేసిన పాపాలను భగవంతుడు క్షమించాలని ప్రార్థిస్తూ సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని కోరుకుంటారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్ గ్రామంలోని మహమ్మదీయ మసీదులో ముస్లింలు ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఉపవాసం ముగిసిన అనంతరం ముస్లింలు సమూహంగా కలిసి ప్రార్థనలు చేసి ఖర్జూరం, పండ్లు, వివిధ రకాల వంటకాలతో ఉపవాస విరమణ చేశారు. అనంతరం ఒకరితో ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సామరస్యంతో ఇఫ్తార్ విందును ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ యూసుఫ్ ఉస్మాన్, బాబా, ఖా జామైనొద్దీన్, మహమ్మద్ పాషా, జలాలుద్దీన్‌లతో పాటు గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ రంజాన్ మాసం మనుషులలో సహనం, దాతృత్వం, పరస్పర గౌరవం పెంపొందించే పవిత్ర కాలమని తెలిపారు. సమాజంలో శాంతి, ఐక్యత, సోదరభావం నెలకొనాలని అందరూ ప్రార్థించారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో పిల్లలకు ఎగ్జామ్స్ ఫాడ్స్ కంబాక్స్ పెన్నులు పంపిణీ

- **మాజీ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్,సిపిఎం జడ్పీ ఎక్స్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ జియావుద్దిన్ జ్ఞాపకార్ధంగా...**



**నేటిసాక్షి తిరుమలాయపాలెం మార్చి 6 (రుద్రరాజు) :** తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్స్ సయ్యద్ జీయావుద్దీన్ జ్ఞాపకార్థం స్కూల్ హెడ్మాస్టర్ గోపాలరావు అధ్యక్షతన వారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పెన్నులు ప్యాడ్స్ పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్,సంగబత్తుల స్వాతి రెడ్డి జియావుద్దీన్ కుమారులు ఉమ్మడి ఖమ్మం జిల్లా నవతెలంగాణ రీజినల్ మేనేజర్ సయ్యద్ జావిద్ మాజీ రిటైర్డ్ టీచర్ వనవాసం జనార్దన్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు సంగబత్తుల సుమన్ రెడ్డి సీఐటీయూ మండల నాయకులు వశపోంగు వీరన్న ఉపసర్పంచ్ భూక్యా కానీల్ కుమార్ నాయక్ యుటిఎఫ్ మండల బాధ్యులు రాజు వారి చేతులమీదుగా అందచేశారు,ఈ కార్యాక్రమంలో పాల్గొన్న గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్డ్ మెంబర్స్ భూక్యా అచ్చమ్మ సతీష్,మాజీ సర్పంచ్ లు, భూక్యా వీరన్న నాయక్ మాజీ ఉపసర్పంచ్లు,బత్తుల వెంకటనారాయణ, మాజీ వర్డ్ మెంబర్స్,గుంజ యలమంద, గడ్డం కరుణాకర్ రెడ్డి,గంధసిరి నవీన్, చంద్ పాషా, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, మరియు టీచర్స్ భ్రమరాంబ, లావణ్య, భి,రాజేష్ రాథోడ్ కామల్ల వీరయ్య, తంగెళ్ల రమేష్ పోలేపొంగు వెంకన్న గ్రామ నాయకులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం

## మరికల్ మండల తాసిల్దార్ రామకోటి....



**నేటి సాక్షి నారాయణపేట,మార్చు 6,( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ) :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో గల 212,215 సర్వే నెంబర్లు గల భూములను పూర్తిస్థాయిలో సర్వే చేయిస్తామని మరికల్ మండల తాసిల్దార్ రామకోటి అన్నారు. శుక్రవారం మరికల్ మండల తాసిల్దార్ కార్యాలయంలో స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరికల్ గ్రామంలో గల 212, 215 సర్వేనెంబర్ లో గల భూములలో పూర్తిస్థాయిలో సర్వే చేయిస్తామని తాసిల్దారు వివరించారు. ఇట్టి భూములలో డిజిటల్ సర్వే కూడా చేయిస్తామని ఆయన వివరించారు. పూర్తిస్థాయిలో నివేదిక అట్టి భూముల్లో కంచెను ఏర్పాటు చేసి జిల్లా స్థాయి అధికారులకు నివేదికను అందజేస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో సిపిఐ నారాయణపేట జిల్లా కమిటీ సభ్యులు పి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

## ప్రారంభమైన 99 రోజుల ప్రణాళిక



**నేటి సాక్షి, ఎండపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమానికి శుక్రవారం ఎండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, రైతు వేదికలు, గ్రామపంచాయతీతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం నిర్వహించారు. పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తపేట గ్రామంలో సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో కృపాకర్ హాజరై చేపట్టిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండపల్లి మండల కేంద్రంలో సర్పంచ్ మారం సునీత--జలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై ర్యాలీ నిర్వహించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజలతో కలిసి స్వయంగా శ్రమదానం చేశారు. అదేవిధంగా రాజరాంపల్లి గ్రామంలో సర్పంచ్ సంఘ రమేష్, గుల్లకోట గ్రామంలో సర్పంచ్ గొల్లపల్లి మల్లేశం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమాలతో గ్రామాలు మరింత శుభ్రంగా, ఆరోగ్యవంతంగా మారుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు, అధికారులు, నాయకులు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిలకు సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణి




**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు ) :** రోటరీ క్లబ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోశుక్రవారం పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ ధరూర్ క్యాంప్ పాఠశాల విద్యార్థినిలకు సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణి చేశారు. ధరూర్ పాఠశాలలో చదువుతున్న 61 మంది బాలికలకు పునర్వినియోగ సానిటరీ ప్యాడ్ కిట్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా విద్యాధికారి కె రాము, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, రాజు, గైనకాలజిస్టు డాక్టర్లు అరుణ, హరిత, కార్యక్రమ సమన్వయకర్త విద్యా దేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాళ్ళ అమర్ నాథ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీలత, షబానా తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ శనివారం 07 మార్చి 2026

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీఓ- బి.జయంతి

- పాములపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీఓ- బి.జయంతి.




**నేటి సాక్షి 06 మార్చి పాములపాడు:** మండల కేంద్రమైన పాములపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ- బి.జయంతి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో- బి.జయంతి ఉపాధి పనులు చేసే శ్రామికుల మాస్టర్లను వెరిఫికేషన్ చేయడం జరిగింది. పేదలు పనుల కోసం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలసలు పోకుండా నివారించడానికి, పనుల కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్ళందరికీ ఉపాధి హామీ పని కల్పించడం జరుగుతుందన్నారు. వికసిత్ భారత్ జి రామ్ జి ఉపాధి హామీ పథకం మార్పులో శ్రామికులకు ఒక కుటుంబానికి 125 రోజుల పని కల్పించడం జరుగుతుందన్నారు. ఇది గ్రామీణాభివృద్ధికి నూతన సంకల్పం ఉపాధికి కొత్త హామీ అని అన్నారు. ఉపాధి పని కల్పించని ఎడల నిరుద్యోగ భృతి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శ్రామికులకు సమయానికి కూలి చెల్లింపులు ఉంటాయన్నారు. ఇందులో కూడా ఆలస్యమైన చెల్లింపులకు పరిహారం కూడా ఉంటుందన్నారు. గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామపంచాయతీ పనుల ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ఇందులో శ్రామికుల ఫేస్ యాప్ ఫోటో, చేసే పనుల ఫోటో కూడా ఎప్పటికప్పుడు ఆన్లైన్లో పంపడం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలు తమ కొలతల ప్రకారం పనిచేస్తే మంచి కూలి పడుతుందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో కొంత ఇబ్బంది శ్రామికులకు ఉన్న భవిష్యత్తులో పరిష్కారమయ్యే మార్గం ఉందన్నారు. ఎందుకంటే మన గ్రామీణ ప్రాంతాల్లో నెట్వర్క్ సరిగా లేకపోవడంతో ఫేస్ యాప్, మిగతా వాటి కోసం పనుల దగ్గర తీవ్ర ఆలస్యం జరుగు తున్నదని శ్రామికులు మాకు చెప్పడం జరిగిందన్నారు. మేము కూడా శ్రామికుల సమస్యలను మా అధికారులకు తెలియజేసి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాములపాడు ఫీల్డ్ అసిస్టెంట్ జూపల్లె. లింగస్వామి, మేట్ కలబండి.నాగరాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొనడం జరిగింది.

# ప్రారంభమైన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"






- కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"
- మొదటిరోజు కళాశాలలో పరిశుభ్రతపై అడుగులు

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుండి ప్రారంభమై జూన్ 12 వరకు 99 రోజుల పాటు అమల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ మల్గిరెడ్డి భీమార్జున రెడ్డి, నోడల్ అధికారి పి. నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భీమార్జున రెడ్డి మాట్లాడుతూ, మొదటి 10రోజుల పాటు మార్చి 6 నుండి 15 వరకు ప్రణాళికను తయారు చేసుకొని, కమిటీల ద్వారా కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విధానాలు ప్రజలకు చేరువ కావడంతో పాటు కళాశాలలు, విద్యాసంస్థల్లో సేవలను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, శుభ్రతా కార్యక్రమాలను నిర్వహించడం, పెండింగ్ ఫైల్స్, పరిపాలనా పనులను త్వరగా పూర్తి చేయడం, కళాశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేసి విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్.సి.సి. మరియు ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు కళాశాల ఆవరణను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు శ్రీనివారావు, స్వప్న , ఎన్.సి.సి. సి.టి.ఓ. నరేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# లలితామాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు ముగింపు






- కమణీయం... రమణీయం... శివ పార్వతుల కళ్యాణం...

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు ) :** జగిత్యాల రూరల్ మండలం పొలాసలో కొలువై ఉన్న 108 శ్రీచక్ర సహిత లలితామాత ఆలయంలో శుక్రవారం శివ పార్వతుల కళ్యాణన్ని భక్తుల శివ నామస్మరణల మధ్య, వేద బ్రహ్మోత్తములు అంగ రంగ వైభవంగా,శాస్త్రోక్తంగా నిర్వహించారు.బ్రహ్మశ్రీ తీగుళ్ల విషుశర్మ వైధిక నిర్వహణలో 108 శ్రీచక్ర సహిత లలితమాత ఆలయ 3 వ వార్షికోత్సవ వేడుకలను భక్తుల కోలాహలం మధ్య ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులూ మాధవ్, భరత్,అజయ్ శర్మ,రాకేష్ మిశ్రా, రాధాకృష్ణ తదితరులు కళ్యాణన్ని ఘనంగా నిర్వహించారు. కమణీయం... రమణీయం..అన్న చందంగా చూడ ముచ్చటగా శివపార్వతుల కళ్యానాన్ని వేద బ్రాహ్మణులూ జరిపారు.మొదటగా ఆలయంలో లలితా మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా సుహాసినిలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.మహిళలు లలితసాహస్ర నామ పారాయణం భక్తి, శ్రద్ధలతో చేశారు.అనంతరం శివపార్వతుల కళ్యాణం మంగళ వాయిధ్యాల మధ్య జరిపించారని ఫౌండరి చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య తెలిపారు.ఆలయంలో ఉత్సవాలు శ్రీమాన్ నంబీ వేణుగోపాల చార్య కౌశిక మంగళశాషణమూలతో బ్రహ్మశ్రీ తీగుళ్ల విషు శర్మ వైధిక నిర్వహణలో శుక్రవారం ముగింపు కార్యక్రమాలు జరిగాయని 108 శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయ ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప వివరించారు.ఈ కార్యక్రమంలో ఉటూరి కళ్యాణి, పాంపట్టి సులోచన, ఆది వనజ, పెద్ది అశ్విని, కటకం రమ, శిరీష, ఉటూరిఅర్చన,స్వప్న, మహేందర్, ఉజగిరి జమున,మహేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
- బిసి సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేత



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పెండింగ్లో ఉన్న బీసీ విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ కు బిసి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ యు-వజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద విద్యార్థులు ప్రభుత్వ ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లపై ఆధారపడి విద్యని అభ్యసిస్తున్న సందర్భంలో ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సినటువంటి స్కాలర్షిప్స్ నేటికీ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు పరీక్షల సమయంలో తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని, ఫీజు చెల్లిస్తేనే కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్స్ ఇస్తామంటూ, లేకపోతే హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులను బెదిరిస్తున్న సందర్భం, అలాగే కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులు చదువు కోలేని పరిస్థితి ఉన్నదని, వెంటనే ప్రభుత్వం రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలో చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్క నాగేశ్వరావు, పోలగానే వెంకటేష్ గౌడ్, ఎర్రబెల్లి గంగాధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గిఫ్ట్ ఎ స్మైల్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ




**నేటి సాక్షి సిరిసిల :** శివకుమార్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని 11వ వార్డ్ రాజీవ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం నిర్వహించే "గిఫ్ట్ ఎ స్మైల్" కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పెన్లు, ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేసి వారికి ప్రోత్సాహం అందించారు.ఈ సందర్భంగా స్థానిక మాజీ ఎంపీటీసీ ఒగ్గు రాజేశం రాజేశం, 24వ వార్డ్ కౌన్సిలర్ బుర్ర మల్లికార్జున్, బీఆర్ఎస్వీ నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే రాజీవ్ నగర్ ప్రభుత్వ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు అభిలషిస్తూ బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అలువల ఈశ్వర్, 11వ వార్డ్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పచునూరి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు తీగల ప్రవీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోరిత్యాల శ్రీకాంత్, నరేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన

# ఉపాధి పనిలో ఐరిష్ రావడం లేదని కూలీల ఆందోళన



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** ఉపాధి పనిలో ఐరిష్ రావడం లేదని గన్నేరువరం మండలం హనుమాజీపల్లె ఉపాధి కూలీల శుక్రవారం ఆందోళనకు దిగారు. ప్రొద్దున 6 గంటలకు వచ్చి 10 గంటల వరకు ఉంచుకొని ఈ ఐరిస్ రావడం లేదని వెళ్లగొడుతున్నారని వారం రోజులుగా ఇలానే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరు ఈ ఐరిస్ కోసం గంటల తరబడి వేచి ఉన్న ఐరిష్ రావడం లేదన్నారు. చిన్న పిల్లలను విడిచిపెట్టి ఉదయాన్నే పనికి వచ్చిన ఈ కేవైసీ రావడం లేదని వెల్లిపొమ్మంటున్నారని ఆందోళన చేపట్టారు. ఇలా అయితే మేము ఇలా బతకాలని మహిళా సంఘం లోన్ ఎలా కడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ కేవైసీ తీసేసి పాత పద్ధతిలోనే పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు పరీక్ష పాడ్స్, పెన్నులు పంపిణీ చేసిన కోమల్ల జలందర్..



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి: ( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** గొల్లపల్లి మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న జడ్పీహెచ్ఎస్ (బాయ్స్ఉగర్ల్స్) విద్యార్థులకు పరీక్ష పాడ్స్, పెన్నులు పంపిణీ చేసిన ముదిరాజ్ మండల అధ్యక్షుడు కోమల్ల జలందర్. ఈ సందర్భంగా జలందర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జి స్కిల్స్ ఉ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ యజమాని ముంజంపల్లి రమేష్, వార్డు మెంబెర్ సంగేమ్ కళ్యాణ్ కుమార్, ఐతరవేని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన గ్రామ సర్పంచ్.



**నేటి సాక్షి ..చిలుకూరు :** చిలుకూరు మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ నాలుగో కేంద్రాన్ని పరిరక్షణలో భాగంగా పిల్లల పోషణ నిమిత్తం గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు నమోదు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు విద్యా కార్యక్రమాలు వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణీ స్త్రీలకు అందుతుందనే అంశాన్ని పరిశీలించారు.మరింత మెరుగుదలకు అవసరమైన సూచనలు చేశారు. పిల్లల ఆరోగ్యం, అభివృద్ధి విషయంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 2 వ వార్డు మెంబర్ షేక్ షాఖిర్ పాషా,అంగన్వాడి టీచర్లు నిర్మల, సిబ్బంది గర్భిణీ స్త్రీలు, బాలింత మహిళలు తదితరులు పాల్గొన్నారు.